# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 25-4-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 196 పేజీలు:6 వెల: రూ.1/-


## వైభవంగా కేదార్‌నాథ్ చేరుకున్న ఉత్సవమూర్తి..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రలో భాగమైన కేదార్‌నాథ్ ఆలయాన్ని రేపు తెరవనున్నారు. అయితే ఇవాళ అత్యంత వైభవంగా కేదారీశ్వరుడి ఉత్సవ మూర్తిని ఆలయానికి తీసుకువచ్చారు. ఒకవైపు భారీగా మంచు కురుస్తున్నా.. స్థానికులు అత్యంత భక్తి శ్రద్ధలతో శివయ్యను కేదార్‌నాథ్‌కు తీసుకొచ్చారు.

బాబా కేదార్ ఉత్సవ మూర్తి ఊరేగింపు సమయంలో.. హెలికాప్టర్ నుంచి పువ్వుల్ని చల్లారు. గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్ రూట్లో భారీ సంఖ్యలో భక్తులు డోలోత్సవంలో పాల్గొన్నారు.

## కొలువుదీరేందుకు సిద్ధమవుతోన్న రాష్ట్ర సచివాలయం

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఈనెల 30న ప్రారంభించడమే కాకుండా... ఆ రోజు నుంచే కార్యకలాపాలు ప్రారంభం కావాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ అధికారులు కొలువుదీరేందుకు రాష్ట్ర సచివాలయం సిద్ధమవుతోంది. కొత్తగా నిర్మించిన సచివాలయాన్ని కేవలం ఆరు రోజుల గడువు మాత్రమే ఉండటంతో.. సచివాలయ భవనంలోని ముఖ్యమంత్రి చాంబర్, సంబంధిత కార్యాలయం, పేషీని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సందర్శకుల కోసం ప్రత్యేక హంగులతో కూడిన చాంబర్‌ను సైతం సిద్ధం చేశారు. శాఖల వారిగా గదులను ఎలా విభజించాలన్న దానిపై కసరత్తు కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. శాఖలకు చెందిన మంత్రుల చాంబర్, దాని పక్కనే సంబంధిత శాఖ కార్యదర్శులు, ఇతర సిబ్బందికి చెందిన చాంబర్లను ఒకేచోట ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఒక శాఖకు సంబంధించిన వ్యవహారాలన్నీ.. ఒకే చోట ఉంటే.. ఫైళ్ల క్లియరెన్స్, అధికారులతో తరచూ సమావేశం కావడం, శాఖకు చెందిన వ్యవహారాలను క్షణాల్లో చక్కదిద్దే అవకాశం ఉంటుందని సీఎం కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది. ఆ దిశగానే మంత్రులు, వారికి సంబంధించిన కార్యదర్శులకు చాంబర్లు, గదులను కేటాయించనున్నారు.

## భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 24:భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్టీసీలో, ప్రైవేట్ వెహికల్స్ రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ మొబిలిటీ వాలీ ద్వారా ఎలక్ట్రిక్ తయారీ పరిశ్రమల కోసం ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారీకి తెలంగాణ అడ్డాగా మారాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారీకి సంబంధించిన అన్ని రకాల పార్ట్‌లు తయారయ్యే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో జరిగిన తెలంగాణ మొబిలిటీ వాలీ ద్వారా ఎలక్ట్రిక్ తయారీ పరిశ్రమల కోసం ఒప్పందాలు చేసుకున్నామని కేటీఆర్ గుర్తు చేశారు.

జహీరాబాద్‌లోని మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీలో ఎలక్ట్రిక్ వెహికిల్ తయారీ యూనిట్‌కు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావుతో పాటు పలువురు నాయకులు, కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మహీంద్రా అండ్ మహీంద్రా వారు తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రిక్ పాలసీ నచ్చి రూ. 1000 కోట్ల పెట్టుబడి జహీరాబాద్‌లో పెట్టడం సంతోషంగా ఉందన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమ స్థాపనకు కావాల్సిన అన్ని అనుమతులను 21 రోజుల్లో ఇస్తున్నామని తెలిపారు. టీఎస్ ఐపాస్ పాలసీ దేశానికి ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ వచ్చిన తర్వాత 23 వేల పరిశ్రమలు నెలకొల్పాము. మూడు లక్షల 30 వేల పెట్టుబడులు వచ్చాయి. 20లక్షల మందికి ఉపాధి అవకశాలు లభించాయని తెలిపారు.



కొత్తగా వచ్చే కంపెనీలలో స్థానిక యువతకు పెద్దపీట వేసి ఉద్యోగాలు ఇస్తామన్నారు. జహీరాబాద్ ప్రాంతంలోని స్థానిక యువత కోసం ప్రభుత్వ పరంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాము. ఉద్యోగాలు రావాలంటే యువత స్కిల్ పెంచుకోవాలని కేటీఆర్ సూచించారు.

## పెండింగ్ బిల్లులపై గవర్నర్ కీలక నిర్ణయం.. ఆ బిల్లుకు నో చెప్పిన తమిళ సై

హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : పెండింగ్ బిల్లులపై గవర్నర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. డీఎంఈ వయసు విరమణ పెంపు బిల్లును గవర్నర్ తమిళ సై తిరస్కరించారు. పురపాలక చట్ట సవరణ బిల్లుపై వివరణ కోరారు. అలాగే ప్రైవేట్ యూనివర్సిటీలపై సైతం గవర్నర్ వివరణ కోరారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, అడిషనల్ డైరెక్టర్, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల రిటైర్‌మెంట్ ఏజ్‌ను 61 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసిన బిల్లుకు గవర్నర్ నో చెప్పారు. మరో రెండు బిల్లులు పురపాలక చట్ట సవరణ బిల్లు, ప్రైవేట్ వర్సిటీల బిల్లుపై వివరణ కావాలంటూ పెండింగ్‌లో పెట్టారు. పురపాలక సంస్థల్లో అవిశ్వాస తీర్మానం పెట్టడానికి ఇంతకాలం ఉన్న మూడేళ్ళ గడువును నాలుగేళ్ళకు పెంచుతూ మున్సిపల్ చట్ట సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం.. తీసుకొచ్చింది. దీనిపై నిర్ణయం తీసుకునేముందు మరింత వివరణ అవసరమని గవర్నర్ తమిళసై అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలను నెలకొల్పడానికి తీసుకొచ్చిన బిల్లుపై సైతం నిర్ణయం తీసుకునేముందు ప్రభుత్వం నుంచి వివరణ కావాలని గవర్నర్ అభిప్రాయపడ్డారు

## ఏపీ భవన్ విభజనపై సమావేశం మరోసారి వాయిదా

న్యూఢిల్లీ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: ఏపీ భవన్ విభజనపై సమావేశం మరోసారి వాయిదా పడింది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి నేతృత్వంలో ఈరోజు జరగాల్సిన సమావేశం బుధవారానికి వాయిదా పడింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాల అధికారులకు హోంశాఖ అధికారులు సమాచారం పంపించారు. ఈనెల 26న (బుధవారం) కేంద్ర హోం శాఖ కార్యాలయం నార్త్ బ్లాక్‌లో సమావేశం జరుగనుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (సెంటర్ స్టేట్ రిలేషన్స్ విభాగం) సంయుక్త కార్యదర్శి అధ్యక్షతన సమావేశం జరగనుంది. బుధవారం జరిగే ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల ఆర్థిక శాఖ కార్యదర్శులు హాజరుకానున్నట్లు సమాచారం. ఏపీ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్ రావత్), తెలంగాణ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కె రామకృష్ణ రావు హజరవుతున్నట్లు తెలుస్తోంది. విభజన చట్టం ప్రకారం ఢిల్లీలోని ఏపీ భవన్ 10 ఏళ్ళలో విభజన కావాల్సి ఉంది. ప్రస్తుతం 48శాతం తెలంగాణ, 52 శాతం ఏపీ వాటాగా ఆస్తులు పంచుకుని రెండు తెలుగు రాష్ట్రాలు ఢిల్లీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే విభజన చట్టం ప్రకారం ఉమ్మడి ఆస్తులు పంచుకోవాలని రెండు రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సూచించిన విషయం తెలిసిందే.

## ఒకే ఒక్క నిర్ణయం.. సూడాన్ అతలాకుతలం..

### 400 మందికి పైగా మృతి



న్యూ డిల్లీ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస );ఒకే ఒక్క నిర్ణయం.. జీవితాన్ని మార్చేస్తుందని అంటారు. అలానే.. ఒకే ఒక్క నిర్ణయం ఇప్పుడు ఆఫ్రికా ఖండంలోని అతి పెద్ద దేశంగా పరిగణిస్తున్న సూడాన్ను అతలాకుతలం చేస్తోంది. 2021లో చోటు చేసుకున్న రాజకీయ పరమైన కారణాలతో ప్రభుత్వాన్ని కూల్చేసిన సైన్యం.. నియంతృత్వ పాలనను సాగిస్తోంది. అయినా.. ప్రజల నుంచి ఎలాంటి తిరుగుబాటు రాలేదు. అన్నీ బాగానే సర్దుకుపోతున్నాయి.అయితే.. అనూహ్యంగా సైనిక పాలకులు తీసుకున్న నిర్ణయం.. ఇప్పుడు దేశాన్ని ఛిన్నాభిన్నం చేయడం తోపాటు.. రోజుకు కొన్ని వందల మంది మృతి చెందే పరిస్థితి వచ్చింది. సూడాన్లో సైన్యం ఒక కీలక భాగం. అదేసమయంలో పారామిలిటరీ సపోర్ట్ రాపిడ్ ఫోర్స్(పీఎస్ ఆర్ ఎఫ్) మరో భాగం. అయితే.. సైన్యానికి ఉన్న బాధ్యతలు.. బరువు.. రాపిడ్ ఫోర్స్కులేదు. అదేవిధంగా రిటైర్మెంట్ విషయంలోనూ రాపిడ్ ఫోర్స్కు వెసులుబాటు ఉంది.అయితే..అనూహ్యంగా స్థానిక సైనిక నాయకత్వం..ఈ రాపిడ్ ఫోర్స్ను కూడా సైన్యంలో కలిపేస్తామని ప్రకటించింది. అంతే! ఈ నిర్ణయం తీసుకున్న దరిమిలా.. సైనికులతోనే రాపిడ్ ఫోర్స్ కు వివాదం తలెత్తింది. దీంతో ఇరు పక్షాలు కూడా ఆదిపత్యం కోసం పోరాడుకుంటున్నాయి. ఈ పోరు కూడా ఎక్కడో కాకుండా.. జనారణ్యంలోనే సాగుతుండడం గమనార్హం. ఫలితంగా గత వారం రోజులుగా రోజు రోజుకు మృతుల సంఖ్య పెరుగుతోంది.మానవ ఆవాసాలు.. కార్యాలయాలు ఆసుపత్రులే లక్ష్యంగా ఇరు వర్గాలు కూడా మారణ కాండను కొనసాగిస్తున్నాయి. ఈ దాడుల్లో చిన్నారులు ఎక్కువగా మృతి చెందుతున్నారని ఐక్యరాజ్యసమితిలోని యూనిసెఫ్ విభాగం ఆందోళన వ్యక్తంచేసింది. అంతర్యుద్ధంగా అభివర్ణించిన ఈ పోరులో ఇరు పక్షాలు బలంగా పోరాడుతుండడంతో గగన తలాన్ని సైతం నిలిపివేశారు. ఫలితంగా ప్రపంచ దేశాల ప్రజలను తరలించేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది.ఎక్కడుంది.. సూడాన్?

సూడాన్ అధికారిక నామం.. రిపబ్లికు ఆఫ్ సూడాన్. ఈశాన్య ఆఫ్రికాలో( ఆఫ్రికా ఖండం)లోనే అతిపెద్ద దేశం. అరబ్ ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా భావిస్తారు. 2016లో దేశ జనసంఖ్య 3 కోట్ల 90 లక్షల మంది. అంటే.. మనదేశంలోని రెండు ఈశాన్య రాష్ట్రాలను కలిపితే అంతన్నమాట. సుడానులో ఇస్లాం మతం ఆధిక్యతలో ఉంది. 2011 నుండి కార్డోఫను బ్లూ నైలు ప్రాంతాలు మతకలహాలకు కేంద్రంగా ఉన్నాయి. 2021లో ప్రభుత్వాన్ని కూలదోసిన సైన్యం అధికారం చేపట్టింది.

## పూంచ్ అటాక్.. 40 మంది అరెస్టు

పూంచ్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్‌లో ఆర్మీ వాహనంపై దాడి జరిగిన ఘటనలో నలుగురు జవాన్లు మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఆ దాడి నేపథ్యంలో పూంచ్ సెక్టార్(ఖనీనీనిఇఃష్ట్ర ూవఇఃబినీతీ)లో భారీగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా 40 మందిని అదుపులోకి తీసుకున్నారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్ కోసం మరింత మంది భద్రతా బలగాల్ని రంగంలోకి దింపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. భాటా దురియాన్ టోటా గాలి ప్రాంతంతో పాటు సమీప ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్ నడుస్తోంది. నాలుగో రోజు సెర్చ్ కొనసాగుతుండడంతో ఆ ప్రాంతాన్ని పూర్తిగా దిగ్బంధం చేశారు. అరెస్టు చేసిన వారిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

## రాష్ట్రంలో సైబర్ నేరాలు మినహా అన్ని రకాల నేరాలలో తగ్గుదల : డీజీపీ అంజనీ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 24: రాష్ట్రంలో సైబర్ నేరాలు మినహా అన్ని రకాల నేరాలు పూర్తిగా తగ్గుదలలో ఉన్నాయని డీజీపీ అంజనీ కుమార్ పేర్కొన్నారు. కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సైబర్ లిటరసీ గణనీయంగా పెరగడంతో పాటు సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని తెలిపారు.

రాష్ట్రంలో క్రైమ్, ఫంక్షనల్ వర్టికల్స్‌పై పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో డీజీపీ అంజనీ కుమార్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సీఐడీ అడిషనల్ డీజీ మహేష్ భగవత్, మహిళా భద్రతా విభాగం అడిషనల్ డీజీ షికా గోయల్, రేంజ్ ఐజీలు చంద్ర శేఖర్ రెడ్డి, షా నవాజ్ కాసీంలు పాల్గొన్నారు.

ఈ సందర్బంగా డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు గురైన వారు అందించే ప్రతీ ఫిర్యాదుపై కేసును నమోదు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నేరాల నమోదు నిర్ధారిత ప్రమాణాలలోనే ఉన్నాయని, వ్యక్తిగత నేరాలు మినహా మిగిలిన నేరాలన్నింటిలోనూ తగ్గుదల ఉందని తెలిపారు. డీజీపీ కార్యాలయంలోని సెంటర్ ఆఫ్ ఏక్సలెన్సీ చేసిన సమీక్ష అనుసరించి రాష్ట్రంలోని మొత్తం 700 పోలీస్ స్టేషన్లలో 330 పోలీస్ స్టేషన్లు అద్భుతమైన పని తీరును కనబర్చాయని పేర్కొన్నారు. ఇదే విధమైన ఉత్తమ సేవలందించేందుకై మిగిలిన పోలీస్ స్టేషన్ల పనితీరును రెగ్యులర్‌గా సమీక్షించాలని సీపీలు, ఎస్పీలను ఆదేశించారు. బ్లూ కోట్స్ పనితీరు అంశంలో ఉత్తమ పనితీరును కనబరిచిన పలు కమిషనరేట్లను, ఎస్పీలను డీజీపీ అభినందించారు. నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్‌ను ఉపయోగించడంపై స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు అడిషనల్ డీజీ మహేష్ భగవత్ తెలిపారు.

నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీస్ అధికారులకు సత్కారం

సంచలనం సృష్టించిన బంజారాహిల్స్ డీఏవీ పాఠశాల పోక్సో కేసు విషయంలో త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి నిందితునికి 20 ఏండ్ల శిక్ష, నగదు జరిమానా విధించడంతో కృషి చేసిన దర్యాప్తు అధికారులు ప్రతాప్ రెడ్డి, బంజారాహిల్స్ ఎస్‌హెచ్‌వో నరేందర్‌లను డీజీపీ అంజనీ కుమార్ అభినందించారు. వీరికి పుష్పగుచ్ఛంతో పాటు ప్రశంసా పత్రం ఇచ్చి సత్కరించారు.

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన బాలికపై అత్యాచారానికి సంబంధించిన కేసును దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన అడిషనల్ డీసీపీ శివ కుమార్, ఎస్‌హెచ్‌వో నరేందర్ గౌడ్‌లను డీజీపీ సన్మానించారు. అదేవిధంగా శివ సాగర్ అనే నిందితుడిని 18 ఏండ్ల తర్వాత అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, శ్రీనివాస్, ఎస్పీ రాంరెడ్డిలను కూడా డీజీపీ సన్మానించారు.

## బీఆర్ఎస్ ప్రతినిధుల సభలను దిగ్విజయంగా నిర్వహించాలి : మంత్రి ఎర్రబెల్లి



వరంగల్, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ ప్రతినిధుల సభలను దిగ్విజయంగా నిర్వహించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ శ్రేణులను ఆదేశించారు. మంత్రి సత్యవతిరాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌తో కలిసి వరంగల్ ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే, జిల్లా చైర్మన్‌లు, బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నేతలతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పార్టీ ప్రత్యేకంగా ప్రతినిధుల సభను ఏర్పాటు చేసిందని.. ఎజెండా, సభ నిర్వహణ, ఏర్పాట్లపై సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

పార్టీ పరంగా చేయాల్సిన తీర్మానాల విషయంలో చురుగ్గా వ్యవహరించాలని, పార్టీ నేతలు, ముఖ్యులు, సీనియర్లు కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఆత్మీయ సమ్మేళనాల లాగే, నియోజకవర్గ స్థాయిలో ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు కనీసం 5వేల మంది ప్రతినిధులతో ఈ సభలు నిర్వహించాలన్నారు. అమర వీరులకు నివాళులర్పించడం, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేయడం, ప్రతినిధులకు స్వాగతం పలకడం, అమర వీరులకు నివాళులర్పించడం, రాష్ట్రస్థాయి, దేశ స్థాయి సమస్యలతోపాటు, స్థానిక సమస్యలపై తీర్మానాలు చేయాలని సూచించారు.

ఆయా తీర్మానాలపై ఒకరు ప్రతిపాదిస్తే, మరొకరు బలపరచాలని, తీర్మానాల విషయంలోనూ సామాజిక సమతూకం పాటించాలని సూచించారు. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం నియోజకవర్గ పార్టీ ప్రతినిధుల సభల నిర్వహణపై మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారని, ఈ మేరకు సూచించిన విధంగా నిర్వహించాలని సూచించారు. సభలో సభ్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. మధ్యాహ్నం అందించే భోజన కార్యక్రమంలో నాణ్యమైన భోజనం అందించాలని కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యేలు కలిసి భోజనాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి దేవరుప్పులలో బీఆర్ఎస్ ప్రతినిధుల సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. మంగళవారం జరిగే సభ ఏర్పాట్లపై ఆరా తీశారు. పనుల వేగం పెంచాలని, రేపు ఉదయంకల్లా ఏర్పాట్లన్నీ పూర్తవ్వాలని చెప్పారు.

### నేటి కందం– నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ పెనుముప్పునట్టి "త్రీయు"ను
కనుమరుగానరించినట్టి కేర్నిత్తలములన
మనమున స్మరింప జేయుగ
ప్రపంచం మలేరియా నివారణా దినమున్!!



ఏప్రిల్ 25 ప్రపంచ మలేరియా దినం

World Malaria Dayt (or) World TB Dayt

–రాధశ్రీ

సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## సేంద్రియ ఉత్పత్తులకు విస్తృత ఆదరణ..మంత్రి జగదీష్ రెడ్డి



యాదాద్రి, ఏప్రిల్ 24: సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రజల్లో విస్తృత ఆదరణ లభిస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మన ఉత్పత్తులు–మన గౌరవం పేరుతో నూతనంగా నిర్మించిన విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాల్స్ ను పరిశీలించారు. అనతరం మాట్లాడుతూ? మహిళా స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తుల తయారీలో ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలు తయారీ ఉత్పత్తుల విక్రయానికి, భవనం ఉచితంగా వినియోగించుకోవాలని తెలిపారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునేందుకు ఇదొక చక్కటి అవకాశం అని చెప్పారు. రసాయన ఎరువులతో పండించిన పంటలతో ప్రజలను అనారోగ్య పాలు చేస్తుందని, నేడు ప్రజల దృష్టి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సేంద్రియ ఉత్పత్తులకు విస్తృత ఆదరణ లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సేంద్రియ ఉత్పత్తులకున్న డిమాండ్ ను ఆయన వివరించారు. చేనేత ఉత్పత్తుల కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి భవిష్యత్ మొత్తం చేనేత దే నన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుటీర, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తుందని చెప్పారు.

జిల్లాలో రైతులు పండించే సేంద్రియ పంటలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, మెప్మా, గ్రామాల్లో తయారు చేసే అన్నిరకాల వస్తువులు కూడా ఇక్కడికి తెచ్చుకొని ఉచితంగానే స్టాల్ పెట్టుకొని అమ్ముకోవడానికి తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చొరవ, మంచి ఆలోచనతో రూ.20 లక్షలతో మన ఉత్పత్తులు– మన గౌరవం పేరుతో విక్రయ శాలను నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. రైతులు, మహిళ సంఘాల సభ్యులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిసిపి రాజేష్ చంద్ర, ఆర్డీవో భూపాల్ రెడ్డి, జిల్లా అధికారులు మందడి ఉపేందర్ రెడ్డి, అనురాధ, శ్యామ్ సుందర్, అన్నపూర్ణ, టీజీవో అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ఏసీపీ వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, గ్రంధాలయ చైర్మన్ అమరేందర్ గౌడ్, స్వయం సహాయక సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ

సౌజన్యంతో

కవన కిరణాలు తెలుగు సాహితీ సమాఖ్య

సెల్ : 90044 28159

ఆధ్వర్యంలో

కవన కిరణాలు మూడవ కవితా సంకలనం,

పి.పద్మావతి గారి 'అమృత ధారలు', 'దివిటీలు', 'జీనేకా నామ్ జందగీ' (హిందీ)

మరియు

ఎం.వి.ఉమాదేవి గారి 'వనజ శతకం'

పుస్తకాల ఆవిష్కరణ

తేది : 29-04-2023 శనివారం, ఉ॥ 9.00 గం॥ల నుండి మ॥ 1.00 గం॥ల వరకు

వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్.

ముఖ్య అతిథి, ఆవిష్కర్త & పురస్కార ప్రదాత

డా॥ కె.వి.రమణా చారి గారు

ఐ.ఎ.ఎస్. (రి) తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు

సభాధ్యక్షులు

శ్రీ శివ మంచాల గారు, వ్యవస్థాపక అధ్యక్షులు

గౌరవ అతిథి

శ్రీ బైస దేవదాసు గారు

నేటినిజం పత్రిక సంపాదకులు

విశిష్ట అతిథి

శ్రీ దేవానంద్ నాగెల్ల గారు

బహుజన సాహిత్య అకాడమి మహారాష్ట్ర శాఖ అధ్యక్షులు, ముంబాయి

ఆత్మీయ అతిథులు

శ్రీ బి.సిహెచ్.వి.సుబ్బారావు గారు, (అశ్విని)

శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు, సినీ, టి.వి. గీత రచయిత

శ్రీ సాహిత్య ప్రకాశ్ గారు, సినీ, టి.వి. నటులు, న్యూస్ రీడర్

డా॥ దీపక్ న్యాతి గారు, సినీ దర్శకులు, నంది అవార్డు గ్రహీత

శ్రీమతి పి.పద్మావతి గారు, 'అమృత ధారలు', 'దివిటీలు' రచయిత్రి

సాహిత్య, సామాజిక, విశిష్ట సేవారత్న జాతీయ పురస్కారం – 2023

పురస్కార గ్రహీత : శ్రీ బైస దేవదాసు గారు

(నేటినిజం పత్రిక సంపాదకులు)

అందరూ ఆహ్వానితులే

# మలేరియా చికిత్స కన్న నివారణే మిన్న..!

**(25 ఏప్రిల్ 'ప్రపంచ మలేరియా దినం' సందర్భంగా)**

ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు 2007 నుంచి 25 ఏప్రిల్ రోజున 'ప్రపంచ మలేరియా దినం' నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. 2000 సంవత్సరం నుంచి మలేరియా నిర్మూలన, రోగ నిర్ధారణ, వైద్యరంగాల్లో ప్రపంచ దేశాలు గుణాత్మక ఫలితాలను సాధించి పిల్లలతో పాటు పెద్దలను మలేరియా నుంచి కాపాడటం జరుగుతోంది. గత రెండు దశాబ్దాలుగా 7 మిలియన్ల ప్రజలను మలేరియా నుంచి కాపాడటం, ఒక బిలియన్ జనులకు మలేరియా సోకకుండా జాగ్రత్తలు చర్యలు తీసుకోవడం జరిగింది. 'ప్రపంచ మలేరియా దినం -2023' నినాదంగా 'జీరో మలేరియా దిశగా అడుగులు : పెట్టుబడులు, ఆవిష్కరణలు, అమలు' అనే అంశాన్ని తీసుకొని సామాన్యులకు అవగాహన కల్పిస్తున్నారు. రాబోయే రోజుల్లో దాదాపు అన్ని ప్రపంచ దేశాలు 'జీరో మలేరియా' దేశాలుగా రూపాంతరం చెందే దిశలో అడుగులు వేయడం సంతోషదాయకం.

## దక్షిణ ఆఫ్రికా దేశాల్లో మలేరియా ముప్పు:

ప్లాస్మోడియం పరాన్నజీవి వల్ల సంక్రమించే మలేరియా ప్రాణాంతకమైన వ్యాధిగా గుర్తించబడింది. ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మానవులకు సోకే మలేరియా వల్ల అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి అధిక జనాభా కలిగిన దేశాల్లో ప్రమాదకరంగా మారడం విచారకరం. విశ్వవ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి ఏటా 229 మిలియన్ల ప్రజలు కొత్తగా మలేరియా బారిన పడుతున్నారని 'ప్రపంచ మలేరియా నివేదిక-2020' తెల్పింది. 2019లో 4.09 లక్షల మలేరియా మరణాలను ప్రపంచవ్యాప్తంగా గమనించారు. విశ్వవ్యాప్తంగా 106 దేశాలకు సంబంధించిన 3.3 బిలియన్ల జనులు మలేరియా బారిన పడే ప్రమాదపు అంచున ఉన్నారు. ప్రపంచ మలేరియా నివేదిక ప్రకారం 2018 ప్రకారం ప్రపంచ మలేరియా కేసుల్లో 93 శాతం ఆఫ్రికా దేశాల్లోనే బయట పడటమే కాకుండా 94 శాతం మరణాలు రికార్డు కావడం జరిగింది.

## మలేరియా రహిత దేశాలు:

ప్రపంచ దేశాలు మలేరియా నిర్మూలనకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయని, కొన్ని దేశాలు 'మలేరియా రహిత దేశాలు'గా ప్రకటించబడ్డాయని ఐక్యరాజ్యసమితి అభినందన పూర్వకంగా హర్షాన్ని వ్యక్తం చేసింది. వరుసగా 3 ఏండ్ల పాటు మలేరియా కేసులు నమోదుకాని దేశాలను 'మలేరియా రహిత దేశాలు'గా ఐరాస ప్రకటిస్తున్నది. 2007లో యూఏఈ, 2016లో శ్రీలంక లాంటి 9 దేశాలను ఐరాస జీరో మలేరియా దేశాలుగా ప్రకటించింది. 2025 నాటికి మరో 25 దేశాలు మలేరియా రహిత దేశాల జాబితాలో చేరేందుకు పటిష్టమైన కార్యాచరణ అమలు పరుస్తున్నాయి. 2019లో మలేరియా కేసులు బయట పడుతున్న 87 దేశాల్లో 46 దేశాలు 10 వేల కన్న తక్కువ కేసులను నమోదు చేశాయని, 2000లో 26 దేశాలు మాత్రమే ఉన్నాయని ఐరాస గుర్తు చేసింది. 2020 నాటికి మరో 24 దేశాలు గత 3 ఏండ్లుగా మలేరియా కేసులు నమోదు కాలేదని, వీటిలో 11 దేశాలు మలేరియా రహిత దేశాల జాబితాలో చేరాయని వివరించింది. చైనా, ఇరాన్, మలేషియా లాంటి మరో 8 దేశాలు 2020 నాటికి 'జీరో మలేరియా' దేశాలుగా గుర్తించబడినవి. భూటాన్, కోస్టారికా, నేపాల్‌లు ఏడాదికి 100 లోపు కేసుల నమోదుతో మలేరియా రహిత దేశాల జాబితాలో చేరేందుకు సిద్ధంగా ఉన్నాయి.

## భారత్‌లో మలేరియా:

1947లో భారత్ జనాభా 330 మిలియన్లు ఉండగా, అందులో ప్రతి ఏటా 75 మిలియన్ల ప్రజలకు మలేరియా సోకడం జరిగింది. 1994లో కేసుల సంఖ్య 2.51 మిలియన్, మరణాలు 0.99 మిలియన్ గుర్తించారు. 2019లో 2.86 లక్షల కేసులు నమోదు కాగా, అక్టోబర్-2020 వరకు 1.57 లక్షల మలేరియా కేసులు నమోదైనాయి. 2000లో 29,500 మరణాలు నమోదు కాగా 2019లో మలేరియా మరణాల సంఖ్య గణనీయంగా పడిపోయి 7,700 లకు చేరడం శుభ పరిణామంగా గుర్తించారు. ఇండియాలో మలేరియా లాంటి 'వాహక జీవి ద్వారా కలిగే వ్యాధి (వెక్టర్ బార్న్ డిసీజెస్)' జాబితాలో డెంగ్యూ, ఫైలేరియాసిస్, కాలా-అజర్, జపనీస్ ఎన్సిఫలైటిస్, చికెన్ గున్యా లాంటి ప్రమాదకర రోగాలు దేశ వైద్యరంగానికి సవాలుగా నిలిచాయి. ఐరాస రూపొందించిన 'ప్రపంచ మలేరియా నివేదిక-2020' గణాంకాల ప్రకారం ఇండియాలో మలేరియా నివారణ చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెల్పింది. 2018 గణాంకాలతో పోల్చితే 2019లో మలేరియా కేసులు 21.3 శాతం, మరణాలు 20 శాతం తగ్గాయని తెలుస్తున్నది. ఇండియాలో 2000-19 మధ్య రెండు దశాబ్దాల కాలంలో మలేరియా కేసులు 83.34 శాతం, మరణాలు 92 శాతం తగ్గటంతో 'మిలినియమ్ డెవలప్‌మెంట్ గోల్స్ - 6' సాధించటంలో సఫలమైనట్లు గమనించారు. మన దేశంలో పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, యంపీల్లో అధిక మలేరియా కేసులను గమనించి, 'హై బర్డన్ టు హై ఇంపాక్ట్' ప్రణాళికలను అమలుపరిచారు.

## మలేరియా రహిత భారతం సాధ్యమా ?

2027 నాటికి ఇండియాను 'మలేరియా రహిత దేశం'గా ప్రకటించడానికి అనేక పటిష్ట కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపట్టడం జరుగుతుంది. మలేరియాకు కారణమైన దోమ కాటును నివారించడం ప్రథమ కర్తవ్యంగా భావించాలి. దోమ కాటు నివారణకు దోమ తెరలు, దోమలను వికర్షించే క్రీములు/ద్రవాలు/కాయిల్స్/మ్యాట్స్ వాడటం, శరీర అవయవాలు కప్పుకునేలా దుస్తులు ధరించడం, డోర్లకు నెట్స్ అమర్చుకోవడం లాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి మురికి నీటి నిల్వలు లేకుండా స్వచ్ఛ భారత్ నిర్వహించడం లాంటివి మలేరియా నిర్మూలనకు దోహదపడతాయి. మలేరియా నివారించదగిన వ్యాధి. సరైన అవగాహనతో అడ్డుకట్ట వేయడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. మలేరియా సోకినా భయపడకుండా అందుబాటులో ఉన్న సరైన చికిత్సతో సకాలంలో వైద్య సలహాలు తీసుకుంటే ప్రాణాపాయం తప్పుతుంది. కరోనా విపత్తు విజృంభణతో మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సి రావచ్చని మరువరాదు.

## మలేరియా కట్టడి మార్గాలు:

దశాబ్దాలుగా మానవాళిని పట్టి పీడిస్తున్న భయంకర మలేరియా వ్యాధిని కట్టడి చేయడానికి అంతర్జాతీయ సమాజం నడుం బిగించడం సంతోషదాయకం. మలేరియా నివారణకు వివిధ దేశాలు వివిధ రకాలైన కార్యాచరణలను అమలు పరచడంలో సఫలీకృతం కావడం గమనిస్తున్నాం. మలేరియా కట్టడికి ప్రభుత్వాల రాజకీయ నిర్ణయాలు ప్రధానమైనవిగా గుర్తించారు. మలేరియాను సమగ్రవంతంగా కట్టడి చేయడానికి దోమల నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత, వ్యాధి నిర్ధారణ మరియు సరైన చికిత్సల పట్ల ప్రభుత్వాలు సకారాత్మక చర్యలు తీసుకోవడంతో పాటుగా అవసర నిధుల కేటాయింపు సమయానుకూలంగా జరగాలి.

మలేరియాకు చికిత్స కన్న నివారణే సులభమని గమనిస్తూ, మలేరియా రహిత భారతదేశ నిర్మాణంలో మనందరం చేయి చేయి కలిపి ఆరోగ్య భారతాన్ని సుసాధ్యం చేద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఐపిసి పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా కావూరి శ్రీనివాస శర్మ




హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):ప్రముఖ పండితుడు శాసనాల చారిత్రిక పరిశోధకుడు కవి గోమాత భక్తుడు డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మను ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా,గో సేవా విభాగానికి జాతీయ కార్యనిర్వహక అధ్యక్షుడిగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్, ఐపీసీ అడ్వైజర్ ప్రముఖ సీనియర్ పాత్రికేయులు సూర్య ప్రకాష్ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఐపిసి గ్రేటర్ హైదరాబాద్ ఇన్చార్జ్ జగదీష్ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు హైదరాబాద్ యూత్ విభాగం అధ్యక్షుడు నవీన్ క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ నంది కొండలరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ శర్మ గారు మాట్లాడుతూ ఐపిసి పంచ సూత్రాలైన మాతృ ప్రేమతో పరిపాలన ప్రతి మనిషికి విద్య వైద్యం ఉచితం భారతదేశ మొత్తం సంపూర్ణ మద్యపాన నిషేధం మతసామరస్యాన్ని పాటిస్తూ గోవుని జాతీయ ప్రాణిగా ప్రకటించడం మానవసేవే మాధవసేవ లను ప్రజల్లోకి తీసుకెళ్లి ఐపీసీ పార్టీ బలోపేతానికి చేస్తానని తెలిపారు.

# ఓటు అడిగే హక్కు బిఆర్ ఎస్ కే ఉంది

**-మంత్రి గంగుల**

కరీంనగర్, ఏప్రిల్ 24:ఓటు అడిగే హక్కు బి ఆర్ ఎస్ కె ఉందని రాష్ట్ర బి సి సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.. ఈ నెల 25 న జరగనున్న పార్టీ ప్లీనరీ పై మీడియా సమావేశం లో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రజలు దేశంలో కూడా తెలంగాణ లాంటి పాలన కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ప్రధాని బీసీనే కదా?బిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదన్నారు.కేంద్రం బిసి మంత్రుత్వా శాఖ ఏర్పాటు చేస్తే?రాష్ట్ర మంత్రిత్వ శాఖ కలిస్తే నిధులు పెరుగ ుతాయన్నారు.ప్లీనరీ లో 12 తీర్మాణాలు 0రవేశ పెట్టనున్నామని క్షునంగా కుల గణన చేయాలనే డిమాండ్ ను కేంద్రం ముందు ఉంచుతామని అన్నారు. బిసి గణాంకాలు వస్తే రిజర్వేషన్ వస్తాయన్నారు. చట్టసభల్లో బి సి రిజర్వేషన్ అమలు చేయాలని తీర్మానించనున్నామని తెలిపారు.

# జగన్ ప్రభుత్వంపై ఇప్పుడిప్పుడే తాను విమర్శలు చేయబోను

**- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు**

అమరావతి ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జగన్ ప్రభుత్వంపై ఇప్పుడిప్పుడే తాను విమర్శలు చేయబోనని రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎందుకు విమర్శలు చేయవని అడిగేవారికి ఆ అర్హత లేదన్నారు. రామోజీ రావు ఆగ్రహిస్తే ఏదో జరిగిపోతుందనే రోజులు పోయాయన్నారు. రామోజీరావు మార్గదర్శి అక్రమాలు-నిజానిజాలు అనే అంశంపై విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న ఉండవల్లి అరుణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈనాడు పత్రికలో వ్యతిరేకంగా రాస్తే ఏదో జరిగిపోయే రోజులు పోయాయన్నారు. గతంలో రాజమండ్రిలో ఎంపీగా పోటీ చేసినప్పుడు తనను ఓడించేందుకు రామోజీరావు ఎంతో ప్రయత్నించినా తాను గెలిచానని గుర్తు చేశారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం పట్ల కూడా ఈనాడు పత్రిక అలాగే వ్యవహరిస్తోందని మండిపడ్డారు.రామోజీరావు తాను చట్టాలను పట్టించుకోనంటారని.. చట్టాలకు అతీతమన్నట్లుగా వ్యవహరిస్తారని ఉండవల్లి నిప్పులు చెరిగారు. తనను ఎవరూ ప్రశ్నించడానికి వీల్లేదని రామోజీరావు వాదిస్తారని తప్పుబట్టారు. తాను ఆర్థిక అక్రమాలకు పాల్పడినా ఎవరూ అడగకూడదనే వితండవాదం రామోజీదన్నారు. గత 60 ఏళ్లుగా తన అక్రమాలను ఎవరూ ప్రశ్నించలేదు కాబట్టి ఇప్పుడూ అడగడానికి వీల్లేదని రామోజీరావు భావిస్తున్నారని ఉండవల్లి అరుణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రామోజీరావు లాంటి వారిని వదిలేస్తే దేశంలో అతిపెద్ద మాఫియా సామ్రాజ్యం తయారవుతుంది అని ఉండవల్లి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ విషయంలోనూ 2006లో రామోజీరావు అడ్డగోలుగా వాదించారని ఉండవల్లి గుర్తు చేశారు. హిందూ అవిభక్త కుటుంబం (హెచ్యూఎఫ్) కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చన్న రామోజీరావు వాదనను ఆర్బీఐ తిరస్కరించిందని గుర్తు చేశారు. ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదని ఆర్బీఐ రామోజీరావుకు స్పష్టం చేసిందన్నారు.రామోజీరావు సైతం ప్రజల నుంచి రూ.2600 కోట్లు డిపాజిట్లు సేకరించడం తప్పని ఆర్బీఐ వద్ద అంగీకరించారని గుర్తు చేశారు. ఆ డిపాజిట్లను వెనక్కి ఇచ్చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా పేర్కొన్నారని వివరించారు. కానీ ఎవరెవరి నుంచి డిపాజిట్లు వసూలు చేశారో చెప్పుమంటే మాత్రం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ డిపాజిట్దారుల వివరాలు తెలియచేయాలని ఇటీవలే సుప్రీం కోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు.అదేవిధంగా మార్గదర్శి చిట్ఫండ్స్ ను నిర్వహిస్తున్న రామోజీరావు అసలు తాను కేంద్ర చిట్ ఫండ్ చట్టాన్ని పట్టించుకోనని సీఐడీ విచారణలో వాదించడం బరితెగింపు అని ఉండవల్లి అరుణ్ కుమార్ ధ్వజమెత్తారు. చిట్ ఫండ్ సంస్థలు తమ చందాదారుల నుంచి వసూలు చేసే సొమ్మును జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలని చట్టంలో ఉందని గుర్తు చేశారు. కానీ ఆ నిధులను రామోజీరావు తన సొంత సంస్థల్లో పెట్టుబడిగా పెట్టారని ఆరోపించారు.మార్గదర్శి చిట్ఫండ్స్ అక్రమాలపై రామోజీరావు ఆయన కోడలిని విచారించేందుకు సీఐడీ అధికారులు వారి ఇంటికే వెళ్లాల్సి వచ్చిందని ఉండవల్లి అరుణ్ గుర్తు చేశారు. దేశంలో ఇతరులకు అలా సాధ్యం అవుతుందా? అని నిలదీశారు. రామోజీరావు కాబట్టి ఏదైనా చెల్లుతుందన్నారు.మార్గదర్శి చిట్ ఫండ్స్లో అక్రమాలను తాను ప్రశ్నిస్తే రామోజీపై కక్ష గట్టానని కొందరు ఆడిటర్లు న్యాయవాదులు వాదిస్తుండటం విడ్డూరమన్నారు. రామోజీరావుకు మార్గదర్శి ఫైనాన్సియర్స్ కు అసలు సంబంధం లేదంటూ రాజాజీ అనే వ్యక్తితో నాపై పరువునష్టం దావా వేయించారని గుర్తు చేశారు. అప్పుడు ఈ ఆడిటర్లు న్యాయవాదులు ఒక్కరైనా మాట్లాడారా? అని నిలదీశారు.తాను వేసిన పిటిషన్ లో ఎక్కడ కేసీఆర్ ప్రభుత్వం ఇంప్లీడ్ అవుతుందో అనే భయంతో రామోజీ ఈనాడులో టీఆర్ఎస్ కు భజన చేస్తున్నారని ఉండవల్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం సచివాలయాన్ని నిర్మిస్తే మయసభ నిర్మించినట్లుగా పెద్ద పెద్ద వార్తలు వేసి కేసీఆర్ ను ఖుషీ చేయడానికి రామోజీ ప్రయత్నించారని విమర్శించారు.

చంద్రబాబు మార్గదర్శి వ్యవహారాలపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ఉండవల్లి తెలిపారు. సింగపూర్ దుబాయిలో చంద్రబాబుకు ఉన్న ఆస్తులు లాంటి వంటి కష్టమైన ప్రశ్నలు ఏవీ తాను అడగనన్నారు. టీడీపీ ప్రభుత్వంలో వ్యవహారాలపైనే అడుగుతానని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్ట్ను తామే కడతామని చంద్రబాబు ప్రభుత్వం అడిగి తీసుకుందా? లేక మీరే కట్టమని కేంద్రమే ఇచ్చిందా? దానికి సమాధానం చెబితే చాలన్నారు.

# ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా!

**-'నేను కొట్టాలనుకుంటే కొట్టగలను.. నేను కొట్టలేదు'-వైఎస్సార్టీపీ నేత వైఎస్ విజయమ్మ**

హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పాదయాత్రను ఆపాల్సిన అవసరం లేదని వైఎస్ విజయమ్మ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ప్రశిస్తున్నారనే షర్మిలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. షర్మిల టెర్రరిస్ట్ కాదన్నారు. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా అంటూ మండిపడ్డారు. ఎప్పుడూ చూసిన షర్మిల ఇంటి చుట్టూ పోలీసులు ఉంటున్నారన్నారు. షర్మిలను పోలీసులు ఎందుకు అరెస్ట్ చేశారో కారణం చెప్పమంటే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని చెబుతున్నారని తెలిపారు. షర్మిలకు వ్యక్తి గత స్వేచ్ఛ లేదా అని ప్రశ్నించారు. "పోలీసులు మీద మీద పడుతుంటే ఆవేశం రాదా.. నేను కొట్టాలనుకుంటే కొట్టగలను..నేను కొట్టలేదు" అని అన్నారు. నియంత, అసమర్థ పాలనను ప్రశ్నిస్తున్నారని... ప్రశ్నించే గొంతుని నొక్కేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. షర్మిల సిట్ కార్యాలయానికి వెళ్తుంటే అరెస్ట్ చేశారని వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు .కాగా.. పోలీసులపై చేయి చేసుకున్న కారణంగా వైఎస్ షర్మిలను పోలీసులు అరెస్ట్ చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. షర్మిలపై ఐపీసీ 330, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన వైఎస్ విజయమ్మ.. కూతురు షర్మిలను పరామర్శించేందుకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. విజయమ్మను పోలీసులు అడ్డుకోవడంతో విజయమ్మ అసహనం వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఓ మహిళా కానిస్టేబుల్‌పై విజయమ్మ చేయి చేసుకున్నారు.

# నేను ఏమైనా క్రిమినల్ నా..? హంతకురాలినా?

**- నాకు వ్యక్తిగత స్వేచ్ఛ లేదా..?**

**-"నేను ధర్నాకు పోలేదు. ముట్టడి అని పిలుపు నివ్వలేదు.**

**-నన్ను బయటకు పోనివ్వకుండా పోలీసులు ఎందుకు అడ్డుకుంటారు..?**

హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సిట్ కార్యాలయానికి తాను ఒక్కదాన్నే వెళ్లాలని అనుకున్నానని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల వెల్లడించారు. సిట్ అధికారిని కలిసి టీఎస్‌పీఎస్సీ దర్యాప్తు మీద వినతి పత్రం ఇవ్వాలని అనుకున్నానని తెలిపారు. కేసు దర్యాప్తు జరుగుతున్నప్పుడు తమ అనుమానాలను అధికారికి చెప్పడం భాధ్యతగా ఫీలయ్యానని అన్నారు. సిట్ ఆఫీస్ కి వెళ్ళడానికిఎవరికీ చెప్పి వెళ్లాల్సిన అవసరం లేదని షర్మిల తెలిపారు. ఇంకా ఆమె మాట్లాడుతూ.. "నేను ధర్నాకు పోలేదు. ముట్టడి అని పిలుపు నివ్వలేదు. నన్ను బయటకు పోనివ్వకుండా పోలీసులు ఎందుకు అడ్డుకుంటారు..? నేను ఏమైనా క్రిమినల్ నా..? హంతకురాలినా? నాకు వ్యక్తిగత స్వేచ్ఛ లేదా..? నా ఇంటి చుట్టూ వందలాది మంది పోలీసుల పహారా ఎందుకు..? పోలీసులు నాపై దురుసు ప్రవర్తనకి దిగారు. నా దారిన నేను వెళ్తుంటే అడ్డుపడ్డారు. నన్ను అడ్డుకొనే ప్రయత్నం చేశారు.

నా మీద పడితే నేను భరించాలా..? నా రక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ చేసుకోవడం నా భాధ్యత. ఒక మహిళను పురుష పోలీసులు ఎలా అడ్డుకుంటారు..?" అని ప్రశ్నించారు.

అసలేం జరిగిందంటే..

టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో సిట్) అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు బయలు దేరిన ఆమెను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. లోటస్ పాండ్ వద్ద షర్మిల కారు ఎక్కే సమయంలో అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులపై షర్మిల చేయి చేసుకున్నారు. ఈ క్రమంలో షర్మిలకు పోలీసుల మధ్య వాగ్వాదం



చోటు చేసుకుంది. పోలీసులు అడ్డుకోవడంతో షర్మిల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజ్ వ్యవహారంలో సోమవారం సిట్ అధికారులకు మెమోరాండం ఇవ్వాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల భావించారు. అందులో భాగంగా ఇవాళ ఉదయం 10:30 గంటలకు లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయం నుంచి షర్మిల బయలుదేరుతుండగా పోలీసులు ఒక్కసారిగా పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. బయటకు వెళ్లేందుకు అనుమతిలేదని ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే షర్మిల పోలీసులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా పోలీసులు వినిపించుకోలేదు.ఒక పార్టీ అధ్యక్షురాలిపట్ల పోలీసుల తీరు సరిగా లేదనీ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా కానిస్టేబుళ్లను పెట్టలేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఆమెను తోసివేసే ప్రయత్నం చేయడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన షర్మిల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

తన తప్పులేకపోయినా పోలీసులు తనపై ప్రవర్తించిన తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విధుల్లో ఉన్న ఎస్ఐ, కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్నందుకు షర్మిలపై ఐపీసీ 330, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా ఈ ఘటనపై వైఎస్సార్‌టీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు.

# రాజ్యాధికారంలో దివ్యాంగుల భాగస్వామ్యం కల్పించాలి

**-అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేసిన దివ్యాంగ సంఘాల సమాలు సదస్సు**



హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాజ్యాధికారంలో దివ్యాంగుల భాగస్వామ్యం కల్పించాలని దివ్యాంగ సంఘాల సమాలు సదస్సుఅన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేసింది. హైదరాబాద్ ఆబిడ్స్ లోని సూర్య లోక్ కాంప్లెక్స్ లో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ నేషనల్ దివ్యాంగ్ జన విభాగం ప్రెసిడెంట్ శివలింక నాగ ఉజయలక్ష్మి ఆధ్వర్యంలో దివ్యాంగ సంఘాలతో సమాలోచన సదస్సు జరిగింది. ఈ సదస్సు లో 16 దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసదస్సులో దివ్యాంగుల సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఉదయలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగుల చట్టాలు అమలు చేసే విధానం హక్కుల సమస్యల గురించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని విమర్శించారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ దివ్యాంగుల సామాజిక వర్గం కోసం కృషి చేస్తుందని అన్నారు. అన్ని దివ్యాంగ సంఘాల సంఘాలు ఐపిసికి మద్దతిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన నండూరి రమేష్ మాట్లాడుతూ ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో దివ్యాంగుల గురించి ఐపిసి చేస్తున్న కృషిని అభినందించారు. అన్ని దివ్యాంగ సంఘాలు ఇది మంచి పరిణామం అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో దివ్యాంగ సంఘాలు ఐపిసి పార్టీ నాయకులు పాల్గొన్నారు. త్వరలో తెలుగు రాష్ట్రాల్లో దివ్యాంగ నాయకులతో చర్చలు జరిపి కేంద్ర స్థాయిలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ దిశా నిర్దేశ నిర్ణయిస్తుందని ఉదయలక్ష్మి తెలిపారు.

# వామపక్షాలకు కెసిఆర్ గట్టి షాక్ ఇవ్వనున్నారా?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 224రాబోయే ఎన్నికలకు సంబంధించి వామపక్షాలకు గట్టి షాక్ తగిలేట్లుంది. ఇంతకీ ఆ షాక్ ఏమిటంటే బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు వామపక్షాలు సహకారం అందించాలని కేసీయార్ స్పష్టంచేయబోతున్నారట. బీఆర్ఎస్ వామపక్షాల పొత్తు ఖాయమని ఇప్పటికే బాగా ప్రచారం జరుగుతోంది. సీపీఐ సీపీఎం నేతలు కూడా దీన్ని ధృవీకరిస్తున్నారు. కాకపోతే పొత్తుల్లో భాగంగా బీఆర్ఎస్ తమకు ఇచ్చే సీట్లు ఏమిటి ? ఎన్ని అనే విషయాలపైనే స్పష్టత లేదని ఇంతకాలం చెబుతున్నారు.అయితే బీఆర్ఎస్ వర్గాల తాజా సమాచారం ఏమిటంటే వామపక్షాలకు ఒక్కసీటు కూడా ఇవ్వటానికి కేసీయార్ ఇష్టపడటంలేదట. ఎందుకంటే ఎక్కడ సీటిచ్చినా వామపక్షాలు గెలిచే అవకాశాలు తక్కువని సర్వేల్లో తేలిందట.ఇదే విషయాన్ని పై రెండు పార్టీలకు కేసీయార్ తన సర్వే నివేదికలను పంపారని పార్టీ నేతలు చెబుతున్నారు. సీట్లివ్వకపోయినా వామపక్షాలు ఎందుకని బీఆర్ఎస్ కు మద్దతిచ్చి గెలుపుకు ప్రయత్నిస్తాయి ? ఎందుకంటే సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు ఎంఎల్సీ పదవులు ఇస్తానని కేసీయార్ హామీ ఇచ్చారట.ఎంఎల్సీలు బాధ్యతలు తీసుకుని బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు సహకరించమని కేసీయార్ పై ఇద్దరు కార్యదర్శులను రిక్వెస్టుచేశారట. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం ఖమ్మం పాలేరుతో పాటు భద్రాచలం లోను సీపీఐ వైరా కొత్తగూడెం ఖమ్మం నియోజకవర్గాలను కోరుతున్నాయి. అయితే ఈ స్థానాలను ఇవ్వటానికి కేసీయార్ ఏమాత్రం ఇష్టపడటంలేదట.సీట్లిచ్చినా గెలుపు కష్టం కాబట్టి హ్యాపీగా ఎంఎల్సీలు తీసుకుని బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు రాష్ట్రమంతా ప్రచారం చేయాలని అడిగారని పార్టీవర్గాలు చెప్పాయి. దీనికి వామపక్షాల కార్యదర్శులు అంగీకరించే అవకాశాలే ఎక్కువున్నాయి.ఎందుకంటే కేసీయార్ ఆఫర్ ను కాదంటే ఎంఎల్సీలు కూడా దక్కే అవకాశంలేదు. కేసీయార్ ఆఫర్ ను కాదని విడిపోయి పోటీచేస్తే ఒక్క నియోజకవర్గంలో కూడా వామపక్షాలు గెలిచే అవకాశాలు లేవు. అందుకనే కాస్త బెట్టుచేసినా తర్వాత కార్యదర్శులిద్దరు దిగిరాక వేరే దారిలేదట. అందుకనే రాబోయే ఎన్నికల్లో వామపక్షాలకు కేసీయార్ షాక్ తప్పదనే ప్రచారం పెరిగిపోతోందట.

# కేజ్రీవాల్-నితీశ్ కలిసిన వారం రోజుల్లోనే.. తారుమారైన విపక్ష రాజకీయాలు

న్యూఢిల్లీ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): 2024 లోకసభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా ఒంటరిగానే పోటీ చేస్తామని, ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన ప్రకటనతో హస్తిన రాజకీయాలు ఊహించని మలుపు తీసుకున్నాయి. ఆప్ ఇటీవల చేసిన ప్రకటనతో ప్రతిపక్షాల ఐక్యత మరోసారి సందిగ్ధంలో పడిందా అంటే ఔననే అంటున్నారు రాజకీయ పరిశీలకులు.బీహార్ ముఖ్యమంత్రి, జేడియూ అధినేత నితీశ్ కుమార్ ఏప్రిల్ 12న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను కలుసుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షాల ఐక్యత గురించి చర్చించారు. కేంద్రంలో బలంగా ఉన్న నరేంద్ర మోదీసారథ్యంలోని బీజేపీప్రభుత్వాన్ని నిలువరించాలంటే ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని ఇద్దరూ చర్చించారు. ప్రతిపక్షాలు కలిసి కట్టుగా ఉంటూ కేంద్రం నుంచి మోదీ సర్కారును సాగనంపాలని నిర్ణయించినట్లు సమాచారం. నంతరం కేజ్రీవాల్, నితీశ్ చెప్పారు. ఏప్రిల్ 12న ఆర్జేడీ అధినేత, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా నితీశ్‌ను కలిశారు.నితీశ్-కేజ్రీవాల్ కలుసుకున్న వారం రోజుల వ్యవధిలోనే ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన ప్రకటనతో అంతా తారుమారైంది. 2024 లోకసభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా ఒంటరిగానే పోటీ చేస్తామని, ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ఆ పార్టీ నేషనల్ జనరల్ సెక్రటరీ సందీప్ పాఠక్ ప్రకటించారు. కేజ్రీవాల్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తారా.. అన్న ప్రశ్నకు పాఠక్ సమాధానమిస్తూ.. 'ప్రధాని ఎవరన్నది దేశాన్ని నిర్ణయించనివ్వండి' అని జవాబిచ్చారు. దీంతో ఒక్కసారిగా అంతా మారిపోయింది. నితీశ్-కేజ్రీవాల్ భేటీతో ప్రతిపక్షాల మధ్య ఐక్యత పక్కా అనుకున్న వేళ ఐక్యత హౌస్ కాక్ అయింది.కేజ్రీవాల్ మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి ధీటైన జాతీయ ప్రత్యామ్నాయం ఆమ్ ఆద్మీ పార్టీయేనని కేజ్రీవాల్ విశ్వాసం. ఇదే విషయాన్ని ఆయన అనేక వేదికలపై ప్రకటించారు. ఇప్పటికే ఆప్ ఢిల్లీ, పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించి, గోవా, గుజరాత్‌లో ఉనికి చాటుకుని జాతీయ పార్టీ హోదా కూడా పొందింది. ప్రతిపక్షాలకు కాంగ్రెస్ నేతృత్వం అనే అంశంపై కేజ్రీవాల్-నితీశ్‌తో విభేదించారని రాజకీయ పరిశీలకులు వారం క్రితమే చెప్పారు.వాస్తవానికి ఏప్రిల్ 12న నితీశ్ బీహార్ కేజ్రీవాల్‌ను కలిసే ముందు బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లారు. అప్పటికే అక్కడకు చేరుకున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వీరికి స్వాగతం పలికారు. అనంతరం అందరూ గ్రూప్ ఫోటోలు దిగారు. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాల మధ్య ఐక్యతను సాధించడంపై చర్చించారు. కాంగ్రెస్ అనుకూల పార్టీలతో పాటు కాంగ్రెసేతర పార్టీలను కూడా సంప్రదించాలని నిర్ణయించారు. ప్రధాని అభ్యర్థి ఎవరనేదానికన్నా, ప్రతిపక్షాలన్నింటినీ ఒకేతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా చర్చలు సాగాయి. 2024 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి నితీశేనని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాహుల్ ప్రధాని అభ్యర్థిత్వానికి మద్దతు కూడా ఇచ్చారు. అయితే ప్రస్తుత పరిస్థితులు మారిపోయాయి. రాహుల్‌పై అనర్హత వేటు పడటంతో కాంగ్రెస్ తరపున ప్రధాని అభ్యర్థి ఎవరనేది తేలాల్సి ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వాన్ని ఇష్టపడని అనేక ప్రాంతీయపార్టీలున్నాయి. కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే యూపీఏలో కొనసాగుతున్నారు. ఎన్సీపీ, ఉద్ధవ్ శివసేన ఇప్పటికే కాంగ్రెస్ కూటమిలోనే ఉన్నాయి. స్టాలిన్ కూడా యూపీఏ భాగస్వామిగానే ఉన్నారు. బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ దాదాపు అన్ని కూటములకూ దూరంగా ఉన్నారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వైఖరి ఈ ఏడాది ఆఖరులో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చే ఫలితాలను బట్టి స్పష్టమౌతుంది. ఇక మమత పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌కు దాదాపు ఉనికి లేకుండా చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ గెలిచేసరికి బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్‌కు సహకరించడం వల్లే కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారని, భవిష్యత్తులో తాను కాంగ్రెస్‌తో చేతులు కలపబోనని స్పష్టం చేశారు.అంతకు ముందు అదానీ అంశం ప్రజాసమస్య కాదని, అదానీ చేసిన మేలును కూడా గుర్తించాలంటూ ఎన్సీపీఅధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించడంతో ప్రతిపక్షాలు అయోమయంలో పడిపోయాయి. అంతేకాదు ప్రధాని విద్యార్హత అంశం కూడా ప్రజా సమస్య కాదని పవార్ వ్యాఖ్యానించడంతో ప్రతిపక్షాల్లో ఐక్యత లేదనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాయి. దీంతో పరిస్థితిని చక్కబెట్టేందుకు కాంగ్రెస్ నేతలు వెనువెంటనే నితీశ్‌ను తెరపైకి తీసుకువచ్చారు. అందులో భాగంగానే నిన్న నితీశ్ కుమార్ బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌తో కలిసి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ప్రతిపక్షాల ఐక్యత గురించి చర్చించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడేందుకు సంఘటితమవ్వాలని సంకల్పం తీసుకున్నారు. డీఎంకేఎన్సీపీతో కాంగ్రెస్ నేతలు చర్చించాలని.. టీఎంసీ,ఆప్, బీఆర్ఎస్, తదితరపార్టీల అధినేతలతో నితీశ్ కుమార్ చర్చించాలని ప్రధానంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్చల్లో విస్తృత ఏకాభిప్రాయం ఏర్పడితే మొత్తం విపక్ష నేతలందరితో సమావేశమై బీజేపీని ఎదుర్కొనేందుకు వ్యూహం రూపొందించాలని నిర్ణయించారు. వాస్తవానికి ఈ సమావేశానికి ముందే ఖర్గే డీఎంకే అధినేత తమిళనాడు సీఎం స్టాలిన్, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో చర్చించారు. ఈ సమావేశం తర్వాత రాహుల్ గాంధీ, ఖర్గే, నితీశ్, తేజస్వీ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తమ సమావేశం చరిత్రాత్మకమైనదని, విపక్షాలను ఐక్యం చేసేందుకే తాము చరిత్రాత్మక అడుగు వేశామని, ఇది దేశం కోసం విపక్షాలను భావి లక్ష్యం దిశగా నడిపిస్తుందని రాహుల్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష నేతలందరినీ సంఘటితం చేయడమే తమ లక్ష్యమని ఖర్గే ప్రకటించారు. సాధ్యమైనన్ని పార్టీలను సంఘటితం చేసి కలిసికట్టుగా పనిచేయాలన్నదే తమ ప్రయత్నమని నితీశ్ కుమార్ అన్నారు. ఈ సమావేశంలో నితీశ్ కీలక ప్రతిపాదన తెచ్చినట్లు సమాచారం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలంటే 543 నియోజకవర్గాల్లోనూ ప్రతిపక్షాల తరపున ఒక్క అభ్యర్థే ఉండాలని నితీశ్ చెప్పినట్లు తెలిసింది. ఇదే జరిగితే బీజేపీ వ్యతిరేక ఓటు చీలిపోకుండా ఉంటుందని, బీజేపీ అభ్యర్థులను ఓడించడం సులభమౌతుందని నితీశ్ రాహుల్, ఖర్గేలకు వివరించినట్లు సమాచారం. దీనికి వారినుంచి సానుకూల స్పందన వచ్చినట్లు తెలిసింది. అయితే ఈ ఫార్ములాకు మిగతా పార్టీల స్పందన చూశాక ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.పవార్ షాక్ నుంచే ప్రతిపక్షాలు కోలుకోలేకపోతుంటే తాజాగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేస్తామని కేజ్రీవాల్ పార్టీ ప్రకటించడం అటు నితీశ్‌కు, ఇటు విపక్షాలకు షాకింగ్ పరిణామంగా మారింది.మరోవైపు ముచ్చటగా మూడోసారి గెలిచి కేంద్రంలో బీజేపీ పాలన కొనసాగించాలని కమలనాథులు యోచిస్తున్నారు. ప్రతిపక్షాల అనైక్యత బీజేపీకి కలిసొస్తుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. బీజేపీ పదేళ్లుగా అధికారంలో ఉండటంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా విపక్షాలు ఐక్యంగా ఉంటే ఫలితం ఒకరకంగా ఉండేదని, అయితే ప్రతిపక్షాల అనైక్యత వల్ల ఓటు చీలి కమలనాథులకు కలిసి వస్తుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావడం సాధ్యమేనా కాదా అనేది 2024 లోక్‌సభ ఎన్నికలు సమీపించే నాటి రాజకీయ పరిణామాలను బట్టి ఉంటుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# ఏట్టకేలకు ఖలిస్థాన్ వేర్పాటువాద నేత, అమృత్‌పాల్ సింగ్ అరెస్టు

చండీగఢ్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఖలిస్థాన్ వేర్పాటువాద నేత, 'వారిస్ పంజాబ్ దే' (చీఫ్ అమృత్‌పాల్ సింగ్ ను మోగా జిల్లాలో పంజాబ్ పోలీసులు ఆదివారం ఉదయం అరెస్టు చేశారు. ఖలిస్థాన్ వేర్పాటువాది జర్నైల్ సింగ్ భింద్రన్ వాలే స్వగ్రామమైన మోగాలో అరెస్టయిన అతన్ని బఠిండా వాయిసేన కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి అసోంలోని డిబ్రూగర్‌కు ప్రత్యేక విమానంలో తరలించనున్నారు. డిబ్రూగర్ జైలులోనే అతని అనుచరులు కూడా ఉన్నారు. మార్చి 18 నుంచి పోలీసులను తప్పించుకుని వివిధ మారువేషాల్లో తిరుగుతూ వచ్చిన అమృత్‌పాల్ సింగ్ ఆదివారంనాడు మోగా జిల్లాలోనిన రోడె గ్రామంలోని ఓ గురుద్వారాలో ప్రార్థనల చేసిన అనంతరం ఉదయం 7 గంటల సమయంలో లొంగిపోయినట్టు పోలీసులు వెల్లడించారు. ఇంటెలిజెన్స్ ఐజీ నేతృత్వంలోని పోలీసులు గురుద్వారా చేరుకుని అరెస్టు చేసి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు. 36 రోజులుగా తప్పించుకుని తిరుగుతున్న అమృత్‌పాల్ పట్టుబడటంతో పంజాబ్‌లో ఎలాంటి ఉద్రిక్తతలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అమృత్‌సర్ స్వర్ణదేవాలయం, అమృత్‌పాల్ స్వగ్రామమైన జల్లపూర్ ఖేడాలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, ఎలాంటి తప్పుడు సమాచారాన్ని షేర్ చేయవద్దని పంజాబ్ పోలీస్ ఉన్నతాధికారులు ఓ ప్రకటనలో కోరారు.

ఎవరీ అమృత్‌పాల్..?

–అమృత్‌పాల్ 1993 జనవరి 17న పంజాబ్‌లోని బాబా బకల టౌన్‌లో జనవరి 17న జన్మించాడు. చిన్నప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలు సామాజిక ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకునే వాడు.

–దుబాయ్‌లో తన కుటుంబానికి చెందిన ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారంలో కొంతకాల పనిచేసి ఖలిస్థాన్ ఆర్గనేజేషన్ పగ్గాలు చేపట్టేందుకు ఇండియా వచ్చాడు.

–పంజాబ్ కేంద్రంగా ఉన్న 'వారిస్ పంజాబ్ దే'లో చీఫ్ దీప్ సిధు 2022 ఫిబ్రవరిలో మరణించడంతో ఆ సంస్థ రెండవ కీలక నేతగా ఎదిగాడు. అమృత్‌పాల్‌ను తమ సంస్థ నేతగా (చీఫ్) వారిస్ పంజాబ్ ప్రకటించింది.

–దుబాయ్‌లో పదేళ్లు గడిపి పంజాబ్ తిరిగిరాగానే 2022 సెప్టెంబర్ 29న అఫీషియల్ సెర్మనీ నిర్వహించారు.

–ఖలిస్థాన్ ఉద్యమాన్ని నడిపి ఆపరేషన్ బ్లూస్టార్‌లో ఆర్మీ చేతిలో హతమైన సిక్కు ఉగ్రవాద భింద్రన్‌వాలే పోలికల్లో ఉండేలా అమృత్‌పాల్ చూసుకునే వాడు. ఆయన సిద్ధాంతాలను అనుసరించే వాడు. దీంతో ఆయన 'భింద్రన్ వాలే 2.0' తరహాలో కనిపించే వాడు. రాజస్థాన్‌లోని గాంధీనగర్‌లో ఆయన తొలి అమృత్ ప్రీచర్ క్యాంపైన్ నిర్వహించారు. ఆయన చేపట్టిన 'ఘర్ వాప్సి' ప్రచారంతో 927 మంది సిక్కులు, హిందువులు, క్రిస్టియన్లు అమృత్ ఉత్సవంలో పాల్గొని ఖల్సా సిక్కులుగా మారారు.

–హర్యానా గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఆయనకు సపోర్ట్‌గా నిలిచినట్టు చెబుతారు. అమృత్‌సర్‌లో అతిపెద్ద అమృత్ ప్రచార్‌ను ఆయన చేపట్టినప్పుడు ఖల్సా సిక్కులుగా మారేందుకు దేశవ్యాప్తంగా 1,027 మందికి పైగా సిక్కులు, హిందువులు ఇందులో పాల్గొన్నారు.

–దివంగత ప్రధాని ఇందిరాగాంధీకి పట్టిన గతే హోం మంత్రి అమిత్‌షాకు పడుతుందని అమృత్‌సింగ్ గతంలో హెచ్చరించి వివాదంలో చిక్కారు.

–ఖలిస్థాన్ అనుకూల ప్రచారంతో ప్రజలను రెచ్చగొడుతున్నారనే కారణంగా ఆయనను అదుపులోకి తీసుకునేందుకు పంజాబ్ పోలీసులు మార్చి 18న ప్రయత్నించగా, పోలీసుల కళ్లుగప్పి, తన అనుచరుల సాయంతో పరారయ్యాడు. దీంతో పంజాబ్‌తో పాటు అనుమానాస్పద ప్రదేశాల్లో అమృత్ పాల్, అతని అనుచరుల కోసం పోలీసు టీమ్‌లు కోసం జల్లెడ పట్టాయి. అమృత్‌పాల్ అనుచరులు పలువురుని అరెస్టు చేశారు.

–అమృత్ పాల్ ఆచూకీ కోసం ఆయన వివిధ రూపాల్లో ఉన్న అతని ఫోటోలను పంజాబ్ పోలీసులు ఇటీవల విడుదల చేశారు. అందులో పొడవాడి గడ్డం, మరోచోట క్లీన్ షేవ్‌తో ఉన్న ఫోటో, పొట్టి జుట్టుతో ఉన్న ఫోటో, తలపాగా ధరించిన ఫోటో వంటివి ఉన్నాయి.

–అమృత్‌పాల్‌పై నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ మోపారు.

# ప్రధాని సీటు కాదు కెసిఆర్..ఉన్న సీటు కాపాడుకో

**–తెలంగాణలో ఏ పరీక్ష పెట్టినా పేపర్ లీక్ అవుతోంది**
**– పేపర్ లీకేజీలపై ఇప్పటివరకు సీఎం కేసీఆర్ స్పందించలేదు**
**–పేపర్ లీక్ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి**
**–ప్రజాధనాన్ని సీఎం కేసీఆర్ దుర్వినియోగం చేస్తున్నారు**
**–కేసీఆర్ ఎన్ని కుట్రలు చేసినా.. ప్రజలను మోదీ నుంచి దూరం చేయలేరు**
**–ఎంఐఎం కు భయపడే విమోచన దినోత్సవాన్ని జరపట్లేదు.**
**–ఓవైసీ ఎజెండానే కేసీఆర్ అమలు చేస్తున్నారు.**
**–తెలంగాణలో అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు రద్దు**
**–కేంద్రమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా సంచలన వ్యాఖ్యలు**

చేవెళ్ల ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అంచనాలకు తగ్గట్టే 'చేవెళ్ల విజయ సంకల్ప సభ'లో కేంద్రమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్ రద్దు చేస్తామని ప్రకటించారు. తెలంగాణలో బీజేపీ సర్కార్ రావాలా వద్దా?.. ఢిల్లీలోని ప్రధాని మోదీకి వినపడేలా ప్రజలు నినాదించాలని అని అమిత్‌షా పిలుపునిచ్చారు.

9 ఏళ్లుగా బీఆర్ఎస్ అవినీతి పాలన సాగిస్తోందని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీపై ప్రశ్నిస్తే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ని అరెస్ట్ చేస్తారా? ఆయన ఏం తప్పు చేశారని అరెస్ట్ చేశారు? అని మండిపడ్డారు. అక్రమ అరెస్ట్‌లకు బీజేపీ నేతలు, కార్యకర్తలు భయపడరని స్పష్టం చేశారు. తెలంగాణలో యువతకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణలో ఏ పరీక్ష పెట్టినా పేపర్ లీక్ అవుతోందని, పేపర్ లీకేజీలపై ఇప్పటివరకు సీఎం కేసీఆర్ స్పందించలేదని తప్పుబట్టారు. పేపర్ లీక్ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ జరగడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కేంద్ర పథకాలు ప్రజలకు చేరడం లేదన్నారు. కేసీఆర్ ఎన్ని కుట్రలు చేసినా.. ప్రజలను మోదీ నుంచి దూరం చేయలేరని అమిత్‌షా తేల్చిచెప్పారు.

"ప్రజాధనాన్ని సీఎం కేసీఆర్ దుర్వినియోగం చేస్తున్నారు. కేసీఆర్ ప్రధాని కావాలని ఎన్నో కలలు కంటున్నారు. కేసీఆర్.. ప్రధాని సీటు ఖాళీగా లేదని తెలుసుకోవాలి. వచ్చే ఎన్నికల్లో కూడా మోదీనే ప్రధాని. కేసీఆర్ ముందు సీఎం సీటు కాపాడుకోవాలి. కారు స్టీరింగ్ మజ్లిస్ చేతిలో ఉంది. ఎంఐఎం కు భయపడే విమోచన దినోత్సవాన్ని జరపట్లేదు. ఓవైసీ ఎజెండానే కేసీఆర్ అమలు చేస్తున్నారు. కేసీఆర్ అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారు. తెలంగాణ.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వాళ్లది. ఎంఐఎంకు బీజేపీ భయపడదు" అని అమిత్‌షా స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనులకు మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ శంకుస్థాపన

ఖమ్మం, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరులో రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా కల్లూరు చేరుకున్న వారు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తొలుత కల్లూరు మండల కేంద్రంలో రూ.10.50 కోట్లతో నిర్మితం కానున్న 50 పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు.

అలాగే కల్లూరులో రూ.1.93 కోట్లతో నూతనంగా నిర్మించనున్న పర్యవేక్షక ఇంజనీర్, నీటి పారుదల శాఖ కార్యాలయ భవనాన్ని శంకుస్థాపన చేశారు. అనంతరం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్ నందు ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీలు నామా నాగేశ్వర రావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి రెడ్డి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అప్పన్న చందనోత్సవ ఏర్పాట్లపై స్వరూపానందేంద్ర సరస్వతి అసంతృప్తి

విశాఖపట్టణం ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సింహాచలం అప్పన్న చందనోత్సవంలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా శారదా పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. అప్పన్న చందనోత్సవ ఏర్పాట్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సామాన్య భక్తులను దేవుడికి దూరం చేసేలా అధికారులు వ్యవహరించారని, గుంపులుగా పోలీసులను పెట్టారు తప్ప ఏర్పాట్లు సరిగా లేవని విమర్శించారు. తన జీవితంలో తొలిసారి ఇలాంటి చందనోత్సవానికి హాజరయ్యానని, ఎందుకు దర్శనానికి వచ్చానా అని బాధపడుతున్నానన్నారు.కొండ కింద నుంచిపై వరకు రద్దీ ఉన్నా జవాబు చెప్పేవారు లేరని స్వరూపానందేంద్ర సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. తన జీవితంలో ఇలాంటి దౌర్భాగ్యం ఎప్పుడూ చూడలేదన్నారు. భక్తుల ఆర్తనాదాలు వింటుంటే కన్నీళ్లు వస్తున్నాయన్నారు. భక్తుల ఇబ్బందుల మధ్య దైవదర్శనం బాధ కలిగించిందని, ఇలాంటి చందనోత్సవ నిర్వహణ ఎప్పుడూ జరగలేదని స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు.కాగా సింహాచలం అప్పన్న చందనోత్సవానికి వచ్చిన భక్తులకు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. కొండ దిగువన అరకిలోమీటర్ వరకు ఆర్టీసీ బస్సులో భక్తులు వేచి ఉన్నారు. గంటల తరబడి నిలిపివేయడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండమీదకు ఎప్పుడు అనుమతి ఇస్తారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులతో వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలోను.. దేవస్థానం అధికారులు వైఫల్యం చెందారు. ఇంత ఘోరం ఎప్పుడూ చూడలేదని... భక్తులు మండిపడుతున్నారు. కొండమీదకు పంపించాలని భక్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఘాటు రోడ్ వద్ద ట్రాఫిక్ క్లియర్ అయిన తర్వాతే... ఆర్టీసీ బస్సులను కొండపైకి పంపిస్తామని చెప్పారు.

# రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన ఈటల..

హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రాజకీయంగానే తాను మాట్లాడానని.. ఎవరినీ కించపరచలేదన్నారు. తాను రేవంత్‌రెడ్డి పేరు ఎక్కడా ప్రస్తావించలేదని, పార్లమెంట్‌లో కాంగ్రెస్ బీఆర్ఎస్ కలిసి ఉన్నాయని అన్నారు. రేవంత్ కన్నీళ్లు పెట్టుకుంటూ కూడా అసభ్యంగా మాట్లాడారని.. రాజకీయ నేతలు కన్నీళ్లు పెట్టడం మంచిదికాదని ఈటల వ్యాఖ్యానించారు. అయినా రేవంత్‌రెడ్డికి, తనకు పోలిక ఏంటని ప్రశ్నించారు. తాను విద్యార్థి నేతగా ఉన్నప్పటి నుంచే పోరాటాలు చేస్తున్నానని, ఓటుకు నోటుకు కేసులో రేవంత్ జైలుకువెళ్లి వచ్చారని, ఆయన సంస్కారహీనంగా మాట్లాడారని ఈటల రాజేందర్ విమర్శించారు.బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈటెల రాజేందర్ రాజకీయంగా దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. మునుగోడు ఎన్నికల్లో రూ.25 కోట్లు కాంగ్రెస్‌కు సీఎం కేసీఆర్ ఇచ్చారని ఈటల దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క రూపాయి కూడా టీఆర్ఎస్ నుంచి గానీ, ముఖ్యమంత్రి నుంచి సాయం పొందలేదని స్పష్టం చేశారు.మునుగోడు ఎన్నికల్లో ఖర్చు పెట్టిన ప్రతీ రూపాయి కార్యకర్తలు చందాలు వేసుకున్నవేనని, కాంగ్రెస్ పార్టీలోని బలహీన వర్గాల నాయకులే మునుగోడు ఎన్నికలకు ఆర్థిక సాయం చేశారని రేవంత్ రెడ్డి వెల్లడించారు. వారి శ్రమను, ఆర్థిక సాయాన్ని అవమానించేలా ఈటెల మాట్లాడటం సమంజసం కాదని, బీజేపీ నేతలు భాగ్యలక్ష్మి అమ్మవారిని నమ్ముతారని, శనివారం సాయంత్రం 6 గంటలకు వాళ్లు నమ్మే భాగ్యలక్ష్మి టెంపుల్‌లో దేవుడిపై ఒట్టేసి చెబుతానని అన్నారు. తనపై ఆరోపణలను ఈటెల నిరూపించడానికి సిద్ధమా? అని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు.

చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్‌లో తడి బట్టలతో ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని, రాజకీయాల కోసం ఈటెల దిగజారి మాట్లాడటం క్షమించరాని నేరమన్నారు. తనపై ఆరోపణలను రాజేందర్ 24 గంటల్లో నిరూపించాలని, శనివారం సాయంత్రం 6 గంటలకు భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ఈటెల సిద్ధంగా ఉండాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. భాగ్యలక్ష్మి దేవుడిపై నమ్మకం లేకుంటే.. ఏ ఆలయంలో నైనా తడి బట్టలతో ప్రమాణానికి తాను సిద్ధమని రేవంత్ రెడ్డి ఈటెల రాజేందర్‌కు సవాల్ విసిరారు.

# జర్నలిస్ట్ల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుక రావాలి

## – బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్

హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) భూకబ్జాలు లిక్కర్ స్కామ్లు చేస్తే రాష్ట్రం ముందుకు




సాగదని బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు.ఎప్పటి కప్పుడు జర్నలిస్టులంతా భూకబ్జాలు, స్కాములను బహిర్గతం చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని పిలుపు నిచ్చారు.ఖైరతాబాద్ లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్లో బీసీ జర్నలిస్టుల సమ్మేళనం జరిగింది ఈ సమ్మేళనానికి ఈటల రాజేందర్ ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడారు. బీసీ జర్నలిస్టులంతా వారివారి సమస్యల పరిష్కారం కోసం ఏకం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జర్నలిస్టుల వేతనాల కోసం కాకుండా ప్రజా సమస్యల కోసం పోరాడుతారని అన్నారు.ఎన్నో కష్టాలు పడే రంగరించి వార్తలను సేకరించి యాజమాన్యాలకు పంపితే వాళ్లు వాటిని ప్రింట్ చేయకుండాతొక్కి పెడతారని ఆవేదన వ్యక్తం చేసారు.రాజుల సొమ్ము రాళ్లపాలు మనం బీసీల సొమ్ములు అలా కాకూడదని అన్నారు. ఎంతోమంది జర్నలిస్టు తమకు వేతనాలు లేకున్నా తినడానికి తిండి లేకున్నా వార్తలు సేకరించడంలో ముందుంటారని అన్నారు. ఇలాంటి వారిని ప్రభుత్వాలు గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో జర్నలిస్టుల బతుకులు మరి దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నాయని అన్నారు. చిన్నచిన్న పత్రికలు నడుపుకునే వారికి ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వటం లేదని వాళ్ళు ఆస్తులు తాకట్టుపెట్టి భార్య మెడలో పుస్తెలు అమ్ముకొని జీవనం వెళ్లదీస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం గుజరాత్ ఢిల్లీ మహారాష్ట్ర ఇతర రాష్ట్రాలకు ప్రకటనలు ఇస్తుంది కానీ ఇక్కడ చిన్న పత్రికలు ఉన్నాయన్న సంగతి మర్చిపోయిందని అన్నారు. అలాగే అర్హులైన జర్నలిస్ట్ లందరికి ఇళ్ళ స్థలలు ఇవ్వాలని, జర్నలిస్ట్ల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుక రావాలని, పోలీసుల వేదింపులుఅరికట్టాలని,సదస్సు డిమాండ్ చేసింది.ఇలాంటి నాయకులు మనకు వద్దు మనం బీసీ నాయకున్ని ఎన్నుకోవాలని పిలుపు నిచ్చారు.

# ఈనెల 25న భారాస కార్వాన్ నియోజకవర్గ ప్రతినిధుల సదస్సు



హైదరాబాద్ ఏప్రిల్ 24(ఎక్స్ ప్రెస్ న్యూస్ );సకార్వాన్ నియోజకవర్గ ప్రతినిధుల సదస్సును ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్చార్జి కాహర్ జీవన్సింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు లంగర్హౌజ్ లోని డి-ఫోర్ట్ ఫంక్షన్ హాల్ వేదికగా ఈ సదస్సు ప్రారంభమై సాయంత్రం వరకూ కొనసాగుతుందన్నారు. ఈ మేరకు ఆదివారం ఠాహర్ జీవన్ సింగ్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో భారాస మాజీ కార్పొరేటర్లు, బారాస డివిజన్ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్రియాశీలక సభ్యులు, ముఖ్యనేతలు హజరై సదస్సు ఏర్పాట్లపై చర్చించారు. జాతీయ పార్టీగా ఆవిర్భవించిన బారాస పార్టీని అట్టడుగుస్థాయి వరకూ తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సన్నాహక సమావేశంలో భారాస మాజీ కార్పొరేటర్లు మిత్రకృష్ణ, బంగార ప్రకాశ్, డివిజన్ అధ్యక్షులు చంద్రకాంత్, సబూరి రఘు, బంటి యాదవ్, వారాస నేతలు కృష్ణదాస్, జగదీశ్ యాదవ్, దుర్గారాజ్, డివిజన్ అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులతో పాటు క్రియాశీలక సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఎ

# చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి ఘటనపై డీజీపీకి అచ్చెంనాయుడు లేఖ



అమరావతి ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎర్రగొండ పాలెంలో చంద్రబాబు కాన్వాయ్ పై దాడి ఘటనపై డీజీపీ కి ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెంనాయుడు లేఖ రాశారు. చంద్రబాబు కు బందోబస్తు కల్పించాలని ముందే లేఖ రాసిన పట్టించుకోకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జడ్ ప్లస్ క్యాటగిరిలో ఎన్ఎస్‌జి రక్షణలో ఉన్న చంద్రబాబుపై రాళ్ల దాడి ఘటనలో కొంతమంది పోలీసులు వైసీపీ గూండాలతో చేతులు కలిపారని ఆరోపించారు. రాళ్లు , కర్రలు, రాడ్లతో దాడిలో పాల్గొన్నారని లేఖలో పేర్కొన్నారు. వైసీపీ గూండాలను చంద్రబాబు కాన్వాయ్ వద్దకు రానివ్వడం ఏంటని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ దాడిలో ఇద్దరు పోలీస్ అధికారుల పాత్ర ఉందని అచ్చెంనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించారని లేఖలో పేర్కొన్నారు. మంత్రే స్వయంగా ఆందోళన, దాడుల్లో పాల్గొని గుంపులకు నాయకత్వం వహించారని పేర్కొన్నారు.మంత్రి కులాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని చెప్పారు. ఎన్ఎస్‌జీ కమాండింగ్ ఆఫీసర్, మరో ఇద్దరు కమాండర్‌లు గాయపడ్డారని అచ్చెంనాయుడు వివరించారు. ముందుగానే సమాచారం అందించినా డీజీపీ కార్యాలయం నుంచి ఎటువంటి స్పందన లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ దాడిలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి ఆదిమూలపు సురేష్, ఆయన అనుచరులపై వెంటనే కేసు నమోదు చేయాలని లేఖ ద్వారా కోరారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ సంఘటనపై కఠిన చర్యలు తీసుకొని భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని కోరారు. లేఖతో వైసీపీ నేతలకు పోలీసులు ఇస్తున్న సూచనలు , రాళ్ల విసురుతున్న గూండాల విజువల్స్‌ను డీజీపీకి పంపారు.

# ఫసల్ బీమా అమలు చేయకపోవడం వల్లనే నష్టం.. బండి సంజయ్

కరీంనగర్, ఏప్రిల్ 24:ఫసల్ బీమా అమలు చేయకపోవడం వల్లనే తమకు నష్టపరిహారం అందించకపోవడంతో తాము నష్టపోయామని రైతులు తెలిపారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్ పర్యటించారు. వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు.

ముందుగా కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్ పేటలో వానకు దెబ్బతిన్న పంటలు పరిశీలించి.. రైతులకు ధైర్యం చెప్పారు బండి సంజయ్. రైతులంతా అధైర్య పడొద్దని.. బీజేపీ పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందని తెలిపారు. తమకు జరిగిన నష్టాన్ని బండి సంజయ్ కు వివరిస్తూ రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్లే తమకు పంట నష్ట పరిహారం అందకుండా పోయిందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారని బండి వివరించారు.

మన బడి - వజ్రోత్సవాలు
75 Jubilee
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - హుస్నాబాద్
సిద్దిపేట జిల్లా
ఏప్రిల్ 23 నుండి మే 1, 2023 వరకు
ఆహ్వానం
హుస్నాబాద్ బడి పూర్వ విద్యార్థుల
కవి సమ్మేళనం
25.4.2023 మంగళవారం రోజున ఉ॥ 11-30 నుండి
పాఠశాల ఆవరణలో...

'వజ్రోత్సవ కవిత'
కవితా సంకలనం
ఆవిష్కరణ

ముఖ్యాతిథి :
దేశపతి శ్రీనివాస్
కవి, రచయిత, శాసన మండలి సభ్యులు

# డాక్టర్స్ మాదిరిగా లాయర్లకు కుడా రక్షణ చట్టం తీసుక రావాలి



## -ఈనెల 30న జరిగే న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలి

## - తెలంగాణా బిసి న్యాయవాదుల సంఘం పిలుపు

హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్): సామాజిక న్యాయసాధనకై తెలంగాణా బిసి న్యాయవాదుల సంఘం ఈనెల 30న జరుప తలపెట్టిన న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణా బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగుల శ్రీనివాస్,ప్రదాన కార్యదర్శి బత్తుల కృష్ణ లు విజ్ఞప్తి చేసారు. సోమవారం బిసి భవన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి 2 గంటల వరకు జరిగే ఈ మహాసభ కు ముఖ్య అతిధులుగా జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ ఈ.వి.వేనుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్ , తెలంగాణా అడ్వకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్,రాజ్యసభ సబ్యులు ఆర్.కృష్ణయ్య లు హాజరవుతున్నట్లు తెలిపారు. హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియమకాలలో బిసి/ఎస్సి/ఎస్టి లకు జనాభా ప్రకారం రిజర్వేషన్ కోటా ప్రవేశపెట్టాలని, అలాగే జూనియర్ బిసి అడ్వకేట్ కు నెలకు 20 వేల స్టైఫండ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి అడ్వకేట్ కు 250 గజాల ప్రభుత్వ స్థలం, ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అడ్వకేట్స్ అందరికీ, కుటుంబ సభ్యులతో ఇన్సూరెన్స్ వర్తింప చేయాలని కోరారు. ఇటీవల తెలంగాణా రాష్ట్రము లో న్యాయవాదుల పై దాడులు,హత్యలు పెరిగి పోతున్నయని ఆందోళన వ్యక్తం చేసారు.బయట దాడులతో పాటి ఏకంగా కోర్ట్ ఆవరనలోనే లాయర్లపై దాడులు జరుగటం శోచనీయమన్నారు. డాక్టర్స్ మాదిరిగా లాయర్లకు కూడా రక్షణ చట్టం తీసుక రావాలని డిమాండ్ చేసారు. ఈ నెల 30న జరిగే మహా సభకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టులలో ప్రాక్టీస్ చేసే బిసి అడ్వకేట్స్ పాల్గొనాలని కృష్ణయ్య పిలుపు నిచ్చారు.

అలాగే రాజ్యాంగము ? సామాజిక న్యాయము ? అనే అంశంపై చర్చ జరిపి తీర్మానాలు చేయడము జరుగుతుంది. కాబట్టి రాష్ట్ర వ్యాప్తంగా బీసీ అడ్వికేట్స్ అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.

# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించవలసినది

మెదక్, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి ):ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించవలసినదిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రమేష్ తో కలిసి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదీదారుల నుండి 70 వినతులను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా ధరణి, భూ సమస్యలకు సంబంధించిన వచ్చిన వినతుల పై స్పందిస్తూ తగు చర్యలు తీసుకోవాల సినదిగా రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆస్తి తగాదాలు, వివాదాలకు సంబంధించి పోలీసు వారిని, న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసినదిగా ఫిర్యాదీదారులకు సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పింఛన్లు, జిల్లా పంచాయతీ అధికారి, అటవీ శాఖ, మున్సిపాలిటీ, ఎస్సి సంక్షేమం నీటిపారుదల, తదితర శాఖలకు సంబంధించి వచ్చిన వినతులను ఆయా శాఖాధికారులకు అందజేస్తూ వాటిని పరిశీలించి నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరిస్తూ ప్రజావాణి వెబ్ సైట్ లో అప్ డేట్ చేయవలసినదిగా అధికారులకు సూచించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ లో వివిధ శాఖల విభాగాల కోసం పార్టిషన్స్ ఏర్పాటు చేయుటకు గాను తమ శాఖలలో ఉన్న ఇంటరెస్ట్ (వడ్డీ) నిధులను తక్షణమే జిల్లా కలెక్టర్ కు అందజేయవలసినదిగా కోరారు. వివిధ పెద్ద పెద్ద శాఖల ఏర్పాటులో పార్టిషన్స్ కు నిధులు అవసరము న్నాయని, త్వరగా అందజేస్తే తగు ఆమోదం ఇచ్చి ఆర్ అండ్ బి శాఖ ద్వారా వేగవంతంగా పనులు చేపట్టనున్నామని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని సమీక్షిస్తూ మండల ప్రత్యేక అధికారులు కంటి వెలుగు శిబిరాలు సమర్థవంతంగా నడుస్తున్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. నేత్ర పరీక్షలు చేస్తున్న వారికి రీడింగ్ అద్దాలు, మందులు వెంటనే అందించేలా చూడాలని, అవసరమైన స్టాకు ను భౌతికంగా పరిశీలించాలన్నారు. సంబంధిత శాసనసభ్యుల అంగీకారంతో వారం రోజులలోగా జిల్లాలో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా కేంద్రాలను ప్రతి రోజు సందర్శించి నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా ధాన్యం తెచ్చేలా రైతులకు అవగాహన కలిగించాలని, అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. వేసవి దృష్ట్యా రైతులకు ఇబ్బంది కలగకుండా షామియానా, మంచి నీరు ఏర్పాటు చేయాలని, లారీల సమస్య ఉత్పన్నం కాకుండా మానిటరింగ్ చేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ నర్సరీలలో జెర్మినేషన్ పరిశీలించాలని, షెడ్ నెట్ ఉండేలా చూడాలని, ప్రతి మొక్క బ్రతికేలా నీరు పోయాలని ఏమైనా ఇబ్బందులుంటే జిల్లా అటవీ అధికారి, డీఆర్డిఓ , డిపిఓలను సంప్రదించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో అధికారులు శ్రీనివాస్ రావు, రవి ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్, కమలాకర్, రజాక్, శ్రీనివాస్ గౌడ్, జెంలా నాయక్, సుధాకర్, నాగరాజ్, సార శ్రీనివాస్, బ్రహ్మాజీ, ఇందిర, కరుణ, శశి భూషణ్ కలెక్టరేట్ ఏ.ఓ. యూనుస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# విపక్షాల ఐక్యతకు మమత సహకరిస్తారా?

న్యూఢిల్లీ ఏప్రిల్ 24 (ఎక్స్ రేస్స్ న్యూ స్);: బీహార్ ముఖ్యమంత్రి, జేడియూ అధినేత నితీశ్ కుమార్ ఏప్రిల్ 25న టీఎంసీఅధినేత్రి మమతా బెనర్జీతో సమావేశం కానున్నారు. కోల్‌కతాలో దీదీతో సమావేశమై తాజా రాజకీయ పరిణామాలపై చర్చించనున్నారు. అలాగే 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విపక్షాల ఐక్యత గురించి చర్చిస్తారు. మమత పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌కు దాదాపు ఉనికి లేకుండా చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ గెలిచేసరికి బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్‌కు సహకరించడం వల్లే కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారని, లోక్‌సభ ఎన్నికల్లో తాను కాంగ్రెస్‌తో చేతులు కలపబోనని స్పష్టం చేశారు. దీంతో కాంగ్రెస్‌పై మమతకున్న వ్యతిరేకతను నితీశ్ తొలగించగలరా అనేది ప్రశ్నార్థకంగా మారింది.నితీశ్ ఇప్పటికే ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను కలుసుకున్నారు. ప్రతిపక్షాల ఐక్యత గురించి చర్చించారు. కేంద్రంలో బలంగా ఉన్న నరేంద్ర మోదీ, సారథ్యంలోని బీజేపీ, ప్రభుత్వాన్ని నిలువరించాలంటే ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని చర్చించారు. ప్రతిపక్షాలు కలిసి కట్టుగా ఉంటూ కేంద్రం నుంచి మోదీ సర్కారును సాగనంపాలని నిర్ణయించినట్లు సమావేశానంతరం కేజ్రీవాల్, నితీశ్ చెప్పారు.

వాస్తవానికి ఏప్రిల్ 12న నితీశ్ బీహార్ కేజ్రీవాల్‌ను కలిసే ముందు బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఢిల్లీ నివాసానికి వెళ్లారు. అప్పటికే అక్కడకు చేరుకున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వీరికి స్వాగతం పలికారు. అనంతరం అందరూ గ్రూప్ ఫొటోలు దిగారు. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాల మధ్య ఐక్యతను సాధించడంపై చర్చించారు. కాంగ్రెస్ అనుకూల పార్టీలతో పాటు కాంగ్రెసేతర పార్టీలను కూడా సంప్రదించాలని నిర్ణయించారు. ప్రధాని అభ్యర్థి ఎవరనేదానికన్నా, ప్రతిపక్షాలన్నింటినీ ఒకేతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా చర్చలు సాగాయి. 2024 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి నితీశేనని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాహుల్ ప్రధాని అభ్యర్థిత్వానికి మద్దతు కూడా ఇచ్చారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. రాహుల్‌పై అనర్హత వేటు పడటంతో కాంగ్రెస్ తరపున ప్రధాని అభ్యర్థి ఎవరనేది తేలాల్సి ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వాన్ని ఇష్టపడని అనేక పార్టీలున్నాయి. కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే యూపీఏలో కొనసాగుతున్నారు. ఎన్సీపీ, ఉద్ధవ్ శివసేన ఇప్పటికే కాంగ్రెస్ కూటమిలోనే ఉన్నాయి. స్టాలిన్ కూడా యూపీఏ భాగస్వామిగానే ఉన్నారు. బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ దాదాపు అన్ని కూటములకూ దూరంగా ఉన్నారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వైఖరి ఈ ఏడాది ఆఖరులో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చే ఫలితాలను బట్టి స్పష్టమౌతుంది.

మరోవైపు నితీశ్- కేజ్రీవాల్ కలుసుకున్న వారం రోజుల వ్యవధిలోనే ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన తాజా ప్రకటనతో అంతా తారుమారైంది. 2024 లోకసభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా ఒంటరిగానే పోటీ చేస్తామని, ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ఆ పార్టీ నేషనల్ జనరల్ సెక్రటరీ సందీప్ పాఠక్ ప్రకటించారు. కేజ్రీవాల్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తారా.. అన్న ప్రశ్నకు పాఠక్ సమాధానమిస్తూ... 'ప్రధాని ఎవరన్నది దేశాన్ని నిర్ణయించనివ్వండి' అని జవాబిచ్చారు. దీంతో ఒక్కసారిగా అంతా మారిపోయింది. నితీశ్-కేజ్రీవాల్ భేటీతో ప్రతిపక్షాల మధ్య ఐక్యత పక్కా అనుకున్న వేళ ఐక్యత హుష్ కాకీ అయింది.

కేజ్రీవాల్ మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి ధీటైన జాతీయ ప్రత్యామ్నాయం ఆమ్ ఆద్మీ పార్టీదేనని కేజ్రీవాల్ విశ్వాసం. ఇదే విషయాన్ని ఆయన అనేక వేదికలపై ప్రకటించారు. ఇప్పటికే ఆప్ ఢిల్లీ, పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించి, గోవా, గుజరాత్‌లో ఉనికి చాటుకుని జాతీయ పార్టీ హోదా కూడా పొందింది. ప్రతిపక్షాలకు కాంగ్రెస్ నేతృత్వం అనే అంశంపై కేజ్రీవాల్- నితీశ్‌తో ఏకీభవించరని రాజకీయ పరిశీలకులు వారం క్రితమే చెప్పారు.అంతకు ముందు అదానీ అంశం ప్రజాసమస్య కాదని, అదానీ చేసిన మేలును కూడా గుర్తించాలంటూ ఎన్సీపీ, అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించడంతో ప్రతిపక్షాలు అయోమయంలో పడిపోయాయి. అంతేకాదు ప్రధాని విద్యార్హత అంశం కూడా ప్రజా సమస్య కాదని పవార్ వ్యాఖ్యానించడంతో ప్రతిపక్షాల్లో ఐక్యత లేదనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాయి. దీంతో పరిస్థితిని చక్కబెట్టేందుకు కాంగ్రెస్ నేతలు వెనువెంటనే నితీశ్‌ను తెరపైకి తీసుకువచ్చారు. అందులో భాగంగానే నితీశ్ కుమార్ బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌తో కలిసి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో) సమావేశమయ్యారు. ప్రతిపక్షాల ఐక్యత గురించి చర్చించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడేందుకు సంఘటితమవ్వాలని సంకల్పం తీసుకున్నారు. డీఎంకే, ఎన్సీపీతో కాంగ్రెస్ నేతలు చర్చించాలని.. టీఎంసీఆప్, బీఆర్ఎస్‌తదితరపార్టీల అధినేతలతో నితీశ్ కుమార్ చర్చించాలని ప్రధానంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్చల్లో విస్తృత ఏకాభిప్రాయం ఏర్పడితే మొత్తం విపక్ష నేతలందరితో సమావేశమై బీజేపీని ఎదుర్కొనేందుకు వ్యూహం రూపొందించాలని నిర్ణయించారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష నేతలందరినీ సంఘటితం చేయడమే తమ లక్ష్యమని ఖర్గే ప్రకటించారు. సాధ్యమైనన్ని పార్టీలను సంఘటితం చేసి కలిసికట్టుగా పనిచేయాలన్నదే తమ ప్రయత్నమని నితీశ్ కుమార్ అన్నారు. ఈ సమావేశంలో నితీశ్ కీలక ప్రతిపాదన తెచ్చినట్లు సమాచారం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలంటే 543 నియోజకవర్గాల్లోనూ ప్రతిపక్షాల తరపున ఒక్క అభ్యర్థే ఉండాలని నితీశ్ చెప్పినట్లు తెలిసింది.

ఇదే జరిగితే బీజేపీ వ్యతిరేక ఓటు చీలిపోకుండా ఉంటుందని, బీజేపీ అభ్యర్థులను ఓడించడం సులభమౌతుందని నితీశ్ రాహుల్, ఖర్గేలకు వివరించినట్లు సమాచారం. దీనికి వారినుంచి సానుకూల స్పందన వచ్చినట్లు తెలిసింది. అయితే ఈ ఫార్ములాకు మిగతా పార్టీల స్పందన చూశాక ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.పవార్ షాక్ నుంచే ప్రతిపక్షాలు కోలుకోలేకపోతుంటే తాజాగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేస్తామని కేజ్రీవాల్ పార్టీ ప్రకటించడం అటు నితీశ్‌కు, ఇటు విపక్షాలకు షాకింగ్ పరిణామంగా మారింది. ఇప్పుడు మమతనైనా నితీశ్‌కు సానుకూల సంకేతాలిస్తారా లేక కాంగ్రెసేతర ఫ్రంట్‌కే పట్టుబడతారా అనేది వేచి చూడాలని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

# జేసీ ప్రభాకర్ రెడ్డి హౌస్ అరెస్టు

తాడిపత్రి ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);టీడీపీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దీంతో ఆయన ఇంటి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. జేసీ గృహనిర్బంధం నేపథ్యంలో పోలీసులు భారీ ఎత్తున మోహరించారు.తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో పెద్దపప్పూరు వద్ద పెన్నా నదిలో ఇసుక మట్టి అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని గతకొంతకాలంగా జేసీ ప్రభాకర్ రెడ్డి వైసీపీ నేతల పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఇసుక మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటా మని ప్రకటించారు. అలాగే మట్టి ఇసుకను అక్రమంగా తరలించే వాహనాలను తగులబెడతామని జేసీ ప్రభాకరెడ్డి హెచ్చరించారు.ఈ నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటి నుంచి బయటకు రాకుండా సుమారు 100 మంది పోలీసులు ఆయన ఇంటి వద్ద మోహరించారు. ఆయనను ఇంటి నుంచి బయటకు రాకుండా ఉంచేందుకు ఇంటి చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా జేసీ ప్రభాకర్ రెడ్డికి సంఘీభావం తెలిపేందుకు అక్కడికి వచ్చిన 8 మంది టీడీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం జేసీని గృహనిర్బంధం చేశారు. ఈ క్రమంలో ఇంటి నుంచి బయటకు రావడానికి ప్రయత్నించిన ఆయన్ను పోలీసులు తిరిగి ఇంట్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో జేసీ ప్రభాకర్ నేలపై పడిపోయారు.దీంతో పోలీసుల చర్యలను జేసీ తీవ్రం ఖండించారు. తన ఇంటి ముందే కుర్చీలో కూర్చొని ఆయన నిరసన తెలిపారు. దీంతో కుర్చీతో సహా జేసీని బలవంతంగా తిరిగి లోపలికి తీసుకెళ్లేందుకు పోలీసులు ప్రయత్నించారు. పోలీసుల చర్యలను టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పెద్దపప్పూరు పోలీస్టేషన్ వద్ద ధర్నాకు టీడీపీ శ్రేణులకు జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రకటనల వల్లే జేసీని అడ్డుకున్నామని పోలీసులు చెప్పారు.కాగా గతంలో తాడిపత్రి వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డికి మధ్య తీవ్ర మాటల యుద్ధం సాగింది. ఎమ్మెల్యే పెద్దారెడ్డి నేరుగా దాడికి జేసీ ప్రభాకర్ ఇంటికే వెళ్లడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో మరోసారి తాడిపత్రిలో హైటెన్షన్ ఏర్పడింది. 2014లో తాడిపత్రి ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి గెలిచిన జేసీ ప్రభాకర్ రెడ్డి 2019లో పోటీ చేయలేదు. తనకు బదులుగా తన కుమారుడు అస్మిత్ రెడ్డికి సీటు ఇప్పించారు. అయితే జేసీ అస్మిత్ రెడ్డి ఓడిపోయారు. మరోవైపు మునిసిపల్ ఎన్నికల్లో తాడిపత్రిలో టీడీపీ గెలుపొందడంతో జేసీ ప్రభాకర్ రెడ్డి మునిసిపల్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు.

# మీరు సెల్ వాడుతున్నారా.. ఈ పద్ధతులకు స్వస్తి పలకండి

## - తప్పుడు భంగిమల కారణంగా అనారోగ్య సమస్యలు తప్పవు

హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) చేతిలో సెల్ లేకుండా నిమిషం గడిచే పరిస్థితి ఉందా? తప్పనిసరి పరిస్థితుల్లో ఫోన్ పక్కన పెట్టేస్తే ఏవేం మెసేజ్ లు వస్తున్నాయో? ఎవరెవరు కాల్ చేస్తున్నారో? అన్న సందేహాలతో టెన్షన్ పడుతూ. ఎప్పుడు చేతికి మళ్లీ ఫోన్ వస్తుందన్న ఆందోళనకు గురయ్యే వారెందరో. అంతలా సెల్ ఫోన్ మీద ఆధారపడిపోయాయి మన బతుకులు. సర్వకాలాల్లో సర్వావస్థల్లో సెల్ ఫోన్ లేని జీవితాన్ని సెకన్ కూడా ఊహించలేమని చెప్పేటోళ్లు ఎక్కువైన ఈ రోజుల్లో ఈ మాయదారి మొబైల్ ఫోన్ చేసే నష్టం. దానితో వచ్చే కష్టం ఎంత ఎక్కువన్న విషయాన్ని తాజాగా వెల్లడైన ఒక నివేదిక స్పష్టం చేస్తోంది. కూర్చున్నా నిలుచున్నా నడుస్తున్నా పడుకున్నా సందర్భం ఏదైనా సెల్ ఫోన్ వాడేస్తున్న కారణంగా ఆరోగ్యానికి ఎంతో నష్టం వాటిల్లుతోంది. శారీరకంగా కొత్త సమస్యలు చుట్టుముడుతున్నాయి. సెల్ వాడకం ఎక్కువగా వాడేసే టీనేజర్లు టెక్ నెస్ (న్యూ కార్పల్ టన్నెల్ సిండ్రోమ్)తో బాధ పడుతున్నారు. దీని కారణంగా మెడ వెన్నునొప్పితో పాటు తలనొప్పి భుజాల నొప్పులు చేతుల్లో జలదరింపు కండరాలు పటుత్వాన్ని కోల్పోవటం లాంటి సమస్యల్ని వారు ఎదుర్కొంటున్నట్లుగా తాజా అధ్యయనం వెల్లడించింది.

సెల్ వాడే వేళలో మెడను అతిగా వంచేయటం తెలిసిందే. దీని కారణంగా మెడలోని స్నాయువులు కండరాలు.. కీళ్ల పై ఒత్తిడి పడుతోందని ఇండియన్ స్పైనల్ ఇంజూరీస్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఛబ్రా వార్నింగ్ ఇస్తున్నారు. అదే పనిగా సెల్ ను అధికంగా వినియోగిస్తున్న కారణంగా మెడ కండరాలు అవసవ్యంగా సంకోచించటం వల్ల వ్రుతో అనుసంధానమైన చోటు మంట నొప్పి కలిగిస్తుందని చెప్పారు.ఈ నొప్పి ఫాసియా ద్వారా మెడ నుంచి తలకు వ్యాపిస్తోందన్నారు. మొబైల్ వాడే వేళలో వేళ్లు మాత్రమే వాడతామని చాలా మంది అనుకోవచ్చు కానీ. చేతులు మోచేయి కండరం మెడ ఇవన్నీ వినియోగిస్తున్న విషయాన్ని చాలామంది గుర్తించరు. మొబైల్ వాడే వేళలో మెడను కిందకు వంచుతాం. దీంతో మెడ.. వెన్నుముక పై ఒత్తిడి పడుతుంది. దీంతో మెడ వంచి చూసే భంగిమతో వెన్నముక పై తల బరువు పెరుగుతుందని పేర్కొన్నారు. అదెలానో లెక్కల్లో చెప్పుకొచ్చారు.


తల నిటారుగా ఉన్న స్థితిలో దాదాపు 5-8 కేజీల బరువు పుడుతుంది. తల వంగుతున్నప్పుడు 15 డిగ్రీల వద్ద మెడ మీద భారం సుమారు 12 కేజీలు 30 డిగ్రీల వద్ద 18.14 కేజీలకు 45 డిగ్రీల వద్ద 22.23 కేజీలు 60 డిగ్రీల వద్ద 27.22 కేజీల భారం పడుతుంది. ఇలా మెడ అతిగా వంగడంతో వెన్నుముక సపోర్టింగ్ లిగమెంట్లు. కండరాల పై ప్రభావం పడుతుందని చెబుతున్నారు. ఫోన్ మాట్లాడే వేళలో నిలబడి.. కూర్చునే భంగిమలోని లోపాలతో మస్క్యులోస్కెలెటల్ సమస్యకు కారణమవుతుందని .. గర్భాశయ.. థొరాసిక్ నడుము ప్రాంతాల్లో వెన్నుముక దెబ్బ తినటంతో అనేక మంది ఇబ్బంది పడుతున్నారని వైద్యులు వెల్లడించారు.కీళ్లు బాగా పని చేసే వేళలో అవి ఒత్తిడికి గురైనా.. రెస్టు తీసుకునే వేళలో తమను తాము రిపేర్ చేసుకుంటాయని. కానీ కీళ్లు అసాధారణ రీతిలో ఒకే భంగిమలో ఎక్కువ సేపు ఉండటం కారణంగా. తీవ్రమైన పని ఒత్తిడి అరిగిపోయి. తిరిగి బాగయ్యే ఛాన్సు లేనంతగా దెబ్బ తింటాయని పేర్కొన్నారు. ట్రెడ్ మిల్ క్రాస్ ట్రైనర్ వంటి వాటి మీద ఉండే వేళలో మొబైల్ ను అస్సలు వాడొద్దంటున్నారు. మొబైల్ వాడే వేళలో మన భంగిమ ఎలా ఉందన్న విషయంపై మరింత శ్రద్ధ అవసరమంటున్నారు. నిలబడి ఉన్నప్పుడు మెసేజ్ లు పంపుతున్నప్పుడు తలపైకి భుజాలు కిందకు ఉంచాలని. వీలైనంత వరకు మొబైల్ను కళ్లకు సమాంతరంగా ఉంచటమే సరైన భంగిమగా చెబుతున్నారు. కుర్చీ లేదంటే సోఫాలో కూర్చున్న వేళలో వెన్నును నిటారుగా ఉంచి కూర్చోవాలని సూచిస్తున్నారు. సెల్ వాడే వేళ మెసేజ్ పంపే వేళలో మెడ ఎక్కువ సేపు వంచొద్దని చెబుతున్నారు. ఒకవైపు ఏదో పని చేస్తూ మరో వైపు ఫోన్ వాడే మల్టీ టాస్కింగ్ అస్సలు మంచిది కాదంటున్నారు. భోజనం చేస్తూ టీవీ చూస్తే కంప్యూటర్ వినియోగిస్తూ. డ్రైవ్ చేస్తూ చాలా ఈజీగా ఫోన్ వాడేస్తుంటారని కానీ ఇదే మాత్రం మంచిది కాదంటున్నారు. సెల్ అతిగా వాడటం మన కదలికలు.. భంగిమ మీద పెద్దగా శ్రద్ధ చూపని వారు తప్పుడు భంగిమల కారణంగా అరవై డెబ్బై ఏళ్లలో ఎదురుకావాల్సిన ఆరోగ్య సమస్యలు.. మెడ సాగటం.. ఫ్రోజెన్ షోల్డర్.. రౌండెడ్ షోల్డర్ లాంటివి నలభై ఏళ్లకే వచ్చేస్తున్నాయి. వాష్ రూమ్స్.. టాయిలెట్లలో మొబైల్ అధికంగా వాడొద్దని.. ఆ వేళలో వాడటం వల్ల భుజాల కండరాలు.. చేతులు.. మణికట్టు మీద తీవ్రమైన ఒత్తిడి పడతాయని చెబుతున్నారు. సో.. మొత్తంగా సెల్ ఫోన్ ను వాడటం తగ్గించటం.. వాడే వేళలో సరైన భంగిమలో వాడటం తప్పనిసరి అన్న విషయాన్ని అస్సలు మర్చిపోవద్దు.

# మోగపోతుల సుశీలను పరామర్శించిన పరికపల్లి



ఖమ్మం, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దగోపతి గ్రామపంచాయతీలో మోగపోతుల సుశీల అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని ఆమెను పరామర్శించి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్,పెద్దగోపతి యూత్ అధ్యక్షులు ఊటుకూరు రంజిత్,దొడ్డ బాబు,నక్క కిషోర్,జెట్టి కృష్ణ, అనుముల కృష్ణ,అగస్టీన్,చార్లెస్,గండమాల జయరాజ్,కూచిపూడి వెంకటేశ్వర్లు,ఆంటోనీ, పవన్,మోగపోతుల లిలిన్,సతీష్,అజయ్,బండి నాగేశ్వరరావు, మూడు సిద్దు,ఉసికల నవీన్, డాకూరి రవి,ఉప్పి,కుమార్,మహేష్,సౌజన్య తదితరులు తెలియజేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి



కామారెడ్డి, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి):ధాన్యం కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన సహకార సంఘాల, ఐకెపి అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ధాన్యం తడవకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ సౌకర్యం (టెంట్) కల్పించాలని చెప్పారు.కేంద్రాల వద్దకు శుభ్రమైన ధాన్యం తీసుకువచ్చే విధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబులో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పేర్కొన్నారు. సొసైటీ పర్యవేక్షణ అధికారులు కేంద్రాలను నిత్యం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఇప్పటికి జిల్లాలో సహకార సంఘాల ద్వారా 120 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. 200 కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్సులో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా సహకార అధికారిని వసంత, డిఎస్ఓ పద్మ, ఐకెపిడీపీఎం రమేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

# పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహ విభాగం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన శ్రీ రాజేష్ కుమార్ సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమలు ఒ అంతర్గత వాణిజ్య ప్రోత్సాహం విభాగం ప్రస్తుత కార్యదర్శిగా ఉన్న శ్రీ అనురాగ్ జైన్, ఐఎఎస్ (ఎంపిః 89) ను రోడ్డు రవాణా హైవేల మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా నియమించిన తర్వాత ఆయన స్థానంలో శ్రీ రాజేష్ కుమార్ సింగ్ ఐఏఎస్ (కెఎల్ః 89) బాధ్యతలు స్వీకరించారు. దీనికి ముందు ఆయన మత్స్య, పశు సంవర్ధక ఒ పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పశు సంవర్ధక ఒ పాడి పరిశ్రమల కార్యదర్శిగా పని చేశారు.

భారతీయ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారి అయిన శ్రీ రాజేష్‌కుమార్ సింగ్ కేరళ కేడర్‌కు చెందిన 1989వ బ్యాచ్ అధికారి. కేంద్ర ప్రభుత్వంలో ఆయన డిడిఏ కమిషనర్‌గా, పెట్రోలియం ఒ సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శిగా, వ్యవసాయం, సహకార ఒ రైతాంగ సంక్షేమ విభాగం సంయుక్త కార్యదర్శిగా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ విజిలెన్స్ అధికారిగా వంటి అనేక ముఖ్యమైన బాధ్యతలను పోషించారు.

# ఆర్ఎస్సార్‌ను నిర్వీర్యం చేయొద్దు.. దశరథరామిరెడ్డి

అమరావతి, ఏప్రిల్ 24:ఆర్ఎస్సార్ ను నిర్వీర్యం చేసి చరిత్ర హీనులుగా మారకండని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. నంద్యాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధిలో చారిత్రాత్మిక నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంకు గణనీయమైన పాత్ర ఉందని పేర్కొన్నారు.సోమవారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి ఇంజిన్‌గా పనిచేసిన వ్యవసాయ పరిశోధనా స్థానం వలన ఈ ప్రాంతం విత్తన కేంద్రంగా అభివృద్ధి చెందిందనీ, దీంతో ఈ ప్రాంతంలో అనేక విత్తన, వర్తక, వాణిజ్య సంస్థల అభివృద్ధి, అనేక మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు కొందరు వ్యక్తులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి కూడా నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం దోహదపడిందని ఆయన తెలిపారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం భూములను వైద్య కళాశాల నిర్మాణానికి కేటాయించడం వలన జరిగే నష్టాన్ని ప్రజలు గ్రహించడానికి బీహార్‌లోని ఇంపీరియల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కథ గురించి ప్రజలందరూ తప్పక తెలుసుకోవాలన్నారు.అప్పటి భారత దేశ వైస్రాయ్ లార్డ్ కర్జన్ భార్య అభ్యర్థన మేరకు ఆమె సమీప బంధువు అమెరికన్ వ్యాపారవేత్త హెన్రీ ఫిప్స్ అందించిన నిధులతో 1905లో పూసా ఇన్స్టిట్యూట్ గా పిలవబడే ఇంపీరియల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ స్థాపించబడిందనీ, ఈ క్రమంలో బ్రిటీష్ ప్రభుత్వం నంద్యాల, అనకాపల్లిలో వ్యవసాయ పరిశోధనా సంస్థలను ఏర్పాటు చేసిందన్నారు. భూకంపం కారణంగా బీహార్ లోని పూసా ఇన్స్టిట్యూట్ భవనాలు పి యు ఎస్ ఏ-పి హెచ్ ఐ పి పి ఎస్ ఆఫ్ యూఎస్ఏ) 1934లో ధ్వంసమవ్వడంతో ఈ ఇన్స్టిట్యూట్ ను డిల్లీకి తరలించారని ఆయన పేర్కొన్నారు. ఈ ఇన్స్టిట్యూట్ బీహార్ నుండి డిల్లీకి మారిన తరువాత, బీహార్ వ్యవసాయ పరిస్థితి దిగజారడమేగాక పురోగతి కూడా మందగించిందని తెలిపారు.

నంద్యాల, అనకాపల్లి, మచిలీపట్నం వద్ద వ్యవసాయ పరిశోధనా సంస్థలకు చెందిన భూముల్లో వైద్య కళాశాలలను నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాధించినప్పుడు, 1934 లో పూసా, బీహార్‌ను తాకిన భూకంపం కంటే ఈ చర్యలు తక్కువ కాదని గ్రహించి, ఈ విధ్వంసకర చర్యను ఆపడానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి అనేక ప్రయత్నాలు చేసిందని దశరథరామిరెడ్డి గుర్తు చేసారు. నంద్యాల స్థానిక ప్రజా ప్రతినిధులకు తమ వ్యక్తిగత ప్రయోజనాలే ప్రాధాన్యమయ్యాయనీ, ప్రాంతీయ పరిశోధన స్థానంను



తొలిగించి అందులో వైద్య కళాశాల, కలెక్టరేట్ ఏర్పాటుతో ఈ ప్రాంతం చుట్టూ ఉన్న తమ భూములకు విలువను, తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తృత పరుచుకునే చర్యలకు వీరు తెరలేపారని ఆయన దుయ్యబట్టారు. నంద్యాల స్థానిక ప్రజా ప్రతినిధులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం "రైతాంగ సమస్య" ను "రాజకీయ సమస్య" గా ప్రభుత్వం ముందు చిత్రీకరించారని ఆయన విమర్శించారు. దీనికి నిలువెత్తు నిదర్శనాలు శాసనసభలో, ముఖ్యమంత్రి పాల్గొన్న నంద్యాల సభలో సహా అనేక సందర్భాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు దీనిని రాజకీయ అంశంగా ప్రస్తావించడమేనని ఆయన తెలిపారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం రక్షించడంలో స్థానిక శాసన, పార్లమెంటు సభ్యులు విఫలమైతే వారు చరిత్రహీనులుగా మిగులుతారని ఆయన హెచ్చరించారు. ఈ అంశాన్ని ఇంకా రాజకీయ కోణంగానే ప్రభుత్వాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూ, దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే రాబోయే ఎన్నికలలో రైతులు తగిన గుణపాఠం చెబుతారని దశరథరామిరెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి, బనగానపల్లె మండల నాయకులు ఓ.అ.కొండారెడ్డి, సుబ్బారెడ్డి, గోస్పాడు మండల నాయకులు బాలీశ్వరరెడ్డి, మహిపాల్ రెడ్డి, ఆళ్ళగడ్డ మండల నాయకులు జాఫర్ రెడ్డి, కొత్తపల్లి మండల నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, గడివేముల మండల నాయకులు సంజీవరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కర్నూలు జిల్లా నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ఐ.సుదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పాణ్యం మండల నాయకులు బీరం సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, శిరివెళ్ళ మండల నాయకులు మనోజ్ కుమార్ రెడ్డి, బండిఆత్మకూరు మండల నాయకులు రాఘవేంద్ర గౌడ్, కోవెలకుంట్ల మండల నాయకులు వెంకటేశ్వర రెడ్డి, నంద్యాల రైతు సంఘం నాయకులు కొమ్మా శ్రీహరి, పర్వేజ్, నంద్యాల మండల నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌ను తోసి పుచ్చింది సుప్రీం కోర్టు

**-25వ తేదీ వరకూ హై కోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ ని పక్కన పెట్టేసిన సుప్రీం**
**-ఒక రోజు ముందుగానే అవినాష్ రెడ్డి కి ముందస్తు బెయిల్ రద్దు**
**- జూన్ 30 వరకు సిబిఐ విచారణ పొడిగింపు**

న్యూ ఢిల్లీ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ విషయాన్ని సుప్రీం కోర్టు తోసి పుచ్చింది. విచారణ సంస్థల దర్యాప్తులో జోక్యం చేసుకోవడం తగదని అభిప్రాయపడింది. ఈ నెల 25వ తేదీ వరకూ హై కోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ ని సుప్రీం పక్కన పెట్టేసింది. దాంతో ఒక రోజు ముందుగానే అవినాష్ రెడ్డి కి ముందస్తు బెయిల్ రక్షణ తొలగిపోయింది. ఇపుడు ఆయన విషయంలో ఏమైనా కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం అధికారం విచక్షణ సీబీఐకి దాఖలు పడ్డాయి.సీబీఐ ఏం చేయాలన్న దాని మీద సుప్రీం కోర్టు ఏ రకమైన డైరెక్షన్ ఇవ్వకపోయినా సీబీఐ ఇప్పటిదాక సంయమనంతో వ్యవహరించింది అని చెప్పడం ద్వారా సీబీ పని తాను చేసుకునేలా చేసింది.

అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ మీద ఈ నెల 25న తెలంగాణా హైకోర్టులో వాదనలు వినిపించుకోవచ్చు అని చెబుతూనే అప్పటిదాకా అరెస్ట్ చేయవద్దని సీబీఐకి ఆదేశాలు ఇవ్వలేమని సుప్రీం కోర్టు పేర్కొంది అంటున్నారు.సీబీఐ అరెస్ట్ చేయాలనుకుంటే ఎపుడో చేసి ఉండేదని అవినాష్ రెడ్డి తరఫున న్యాయవాదులతో సుప్రీం కోర్టు వ్యాఖ్యానించడం గమనార్హం.

ఇక ఈ కేసు విషయంలో సుప్రీం కోర్టు ధర్మాసనం ఎదుట గంట పాటు వాడి వేడిగా ఇరు పక్షలా వాదనలు జరిగాయి సునీతారెడ్డి తరఫున లాయర్లు అయితే ముందస్తు బెయిల్ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. సీబీఐ తరఫున లాయర్లు తమ విచారణకు ముందస్తు బెయిల్ అడ్డు పడుతోందని కూడా పేర్కొన్నారు అవినాష్ రెడ్డి తరఫున న్యాయవాదులు సీబీఐ అరెస్ట్ చేయకుండానే ముందస్తు బెయిల్ అంటూ తమ వాదనలు వినిపించారు.

మొత్తం వాదనలు విన్న తరువాత సుప్రీం కోర్టు ముందస్తు బెయిల్ ని రద్దు చేసింది. అంతే కాదు సుప్రీం కోర్టు ఈ కేసు విషయంలో సీబీఐ కి ఈ నెల ముప్పయి దాకా ఇచ్చిన గడువుని జూన్ 30కి పొడిగించింది. దీంతో మరో రెండు నెలల పాటు ఈ కేసులో విచారణ జరిపేందుకు సీబీఐకి అవకాశం దక్కింది.

ఇక ఈ కేసులో కొత్త కోణాలు కొన్ని వెలుగు చూస్తున్నందువల్ల సీబీఐ ఈ రెండు నెలల కాలాన్ని ఆ దిశగా సద్వినియోగం చేసుకుంటుందా అన్న చర్చ వస్తోంది.మరో వైపు చూస్తే ఆది సోమవారాలు రెండు రోజులూ సీబీఐ అధికారులు పులివెందులలోనే ఉన్నారు. అణువణువూ అక్కడ పరిశీలిస్తున్నారు. ఇక సీబీఐ అధికారులు అక్కడ స్పెషల్ టీం ని రప్పించి బందోబస్తుని కూడా చేశారని అంటున్నారు. దీంతో ఏ క్షణమైనా అవినాష్ రెడ్డి అరెస్ట్ ఉంటుందా అన్నదే చర్చగా ఉంది.

ఇప్పటికే తెలంగాణా హై కోర్టులో అవసరం అయితే అరెస్ట్ చేస్తామని సీబీఐ చెపిన నేపథ్యంలో ఇపుడు అరెస్ట్ చేసే సమయం వచ్చిందా అన్నది కూడా చూడాలని అంటున్నారు.ఏది ఏమైనా సీబీఐ ని గో ఎహెడ్ అనేలా సుప్రీం కోర్టు తీర్పు ఉందని అంటున్నారు. అదే సమయంలో అవినాష్ రెడ్డికి తీవ్ర నిరాశ కలిగించేలా ఈ తీర్పు ఉందని అంటున్నారు. ఇక ఈ కేసులో తెలంగాణా హై కోర్టు ఈ నెల 25న విచారణ సందర్భంగా అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ మెద ఎలాంటి తీర్పు చెబుతుంది అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు.

# గ్రీవెన్స్‌డేలో అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



ఖమ్మం, ఏప్రిల్ 24:(నేటినిజం ప్రతినిధి): 'గ్రీవెన్స్ డే"లో అందిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ సంబంధిత శాఖల జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో పలు సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అర్జీదారులనుండి స్వీకరించి తగు చర్య నిమిత్తం ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు.తల్లాడ మండలం బస్వాపురం గ్రామంకు చెందిన శీలం బసవేశ్వరి తనకు వచ్చే వితంతు ఫించను నిలుపుదల చేయడం జరిగినది అట్టి ఫించను పునరుద్ధరించగలరని సమర్పించిన దరఖాస్తును,మధిర మండలం రొంపిమళ్ళ గ్రామంకు చెందిన తడికమళ్ళ అచ్చారావు తనకు వచ్చే వృద్ధాప్య పించను నిలుపుదల చేయడం జరిగినదని, పించను పునరుద్దరించగలరని సమర్పించన దరఖాస్తును,మధిర మండలం మల్లారం గ్రామంకు చెందిన కంచర్ల సత్యనారాయణచారీ తనకు 56 సంవత్సరముల వ్యయస్సులో కూలీ పనిచేసుకొని జీవనం కొనసాగిస్తున్నానని తాను షుగర్ వ్యాధితో బాదపడుతున్నానని తనకు ఆసరా పించను మంజూరు చేయుగలరని సమర్పించిన దరఖాస్తును,నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంకు చెందిన పిల్లుట్ల కొండయ్య తను వికలాంగుడినని,తనకు వచ్చే వికలాంగుల పింఛను రావడం లేదని అట్టి ఫించను పునరుద్ధరించగలరని సమర్పించిన దరఖాస్తులను పరిశీలన చేసి తగుచర్య నిమిత్తం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి సూచించినారు. ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గోపాలపురంకు చెందిన వికలాంగుడు దేవసాని మురళి తనకు మూడు చక్రముల మోటారు వాహనం ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును జిల్లా సంక్షేమశాఖ అధికారికి తగు చర్యనిమిత్తం సూచించారు.తల్లాడ గ్రామ పంచాయితీ 3వ వార్డు మల్లారం రోడ్ బాలబారతి స్కూల్ ఏరియా వాసులు తమ నివాసాల వద్ద చేపల దుకాణం,చికెన్ షాపుల వ్యవర్థాలు వేయడం వల్లన దుర్వాసనతో అపరిశుభ్ర వాతావరణంతో ఇబ్బందులకు గురికావడం జరుగుచున్నదని,డ్రై?నేజ్ వ్యవస్థను మెరుగుపర్చి చెత్తకుండీలను ఏర్పాటు చేయగలరని సమర్పించిన దరఖాస్తును పరిశీలన చేసి తగు చర్య నిమిత్తం జిల్లా పంచాయితీ అధికారికి సూచించినారు.చింతకాని మండలం నాగులవంచ గ్రామంకు చెందిన బిళ్ళకంటి సైదులు తన స్వార్జితం అయిన ఇంటి స్థలం ఇద్దరు కుమారులు, కుమార్తెలకు పంచగా తన పేరున 65 గజముల స్థలం ఉంచుకోవడం జరిగినదని,అట్టి స్థలంలో తాను ఇల్లు నిర్మించుకొనుటకు తన కుమారులు అంగీకరించుట లేదని తాను పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్నాని కుమారులు పోషణ సైతం పట్టించుకోవటం లేదని తనకు న్యాయం చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం విచారణ చేసి తగు చర్యలకై రెవెన్యూ డివిజనల్ అధికారికి సూచిండమైనది. కొణిజర్ల మండలం కొణిజర్లకు చెందిన దొడ్డ వెంకటేశ్వర్లు తమ తల్లిగారు దొడ్డ శశిరేఖ పేరున సర్వేనెం.96.ఏలో 1.11 కుంటలు,96బి.లో 20 కుంటలు,279 ఏలో 3.35 కుంటలు మేరక, 279 బిలో6.20 కుంటలు మేరక కలదని అట్టి భూమిని ఇద్దరు అన్న తమ్ములు సరిసమానంగా పంచుకోవడం జరిగినదని,అట్టి భూమిని కొంత మంది ఆక్రమించుకోవడం జరిగినదని సర్వేచేయించి తమకు న్యాయం చేయగలరని సమర్పించిన దరఖాస్తును పరిశీలన చేసి తగు చర్య నిమిత్తం సర్వేల్యాండ్ ఏ.డి కి సూచించడమైనది."గ్రీవెన్స్ డే"లో ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్రనాద్, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జీ-20 ఆరోగ్య మంత్రుల సమావేశం తో పాటు 2023 ఆగస్టు నెలలో భారతీయ వైద్య పరికరాల రంగంపై మూడు రోజుల ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో 2023

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:జీ-20 ఆరోగ్య మంత్రుల సమావేశం తో పాటు 2023 ఆగస్టు నెలలో భారతీయ వైద్య పరికరాల రంగంపై మూడు రోజుల ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో, 2023 నిర్వహించడానికి కేంద్ర ఫార్మాస్యూటికల్స్ విభాగం, పరిశ్రమ సంఘాలు సన్నాహాలు ప్రారంభించాయి. జీ-20 అధ్యక్ష హోదాలో భారతదేశం వ్యవహరిస్తున్న నేపథ్యంలో భారతదేశ వైద్య పరికరాల తయారీ రంగం శక్తి సామర్థ్యాలు, సాధించిన ప్రగతి, అభివృద్ధి సాధించడానికి గల అవకాశాలను ప్రపంచ దేశాలకు తెలియజేయాలన్న లక్ష్యంతో ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో, 2023 ను నిర్వహిస్తున్నారు.

గుజరాత్‌లోని గాంధీ నగర్‌లోని హెలిప్యాడ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు (18-20 ఆగస్టు 2023) వైద్య పరికరాల తయారీ రంగంపై తొలిసారిగా జాతీయ స్థాయి ఎక్స్‌పోను నిర్వహించాలని నిర్ణయించింది. జీ-20 ఆరోగ్య మంత్రుల సమావేశం 2023 ఆగస్టు 17-19 మధ్య గాంధీ నగర్‌లో జరగనుంది.తొలుత ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో 2023 ను జనవరి లో నిర్వహించాలని భావించారు. అయితే, పరిశ్రమ వర్గాల నుంచి అందిన సూచనల మేరకు జీ-20 ఆరోగ్య మంత్రుల సమావేశంతో పాటు ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో 2023 ను నిర్వహించాలని నిర్ణయించారు. దీనివల్ల భారతదేశ వైద్య పరికరాల తయారీ రంగం ప్రపంచానికి పరిచయం అవుతుంది. పిఎల్ఐ పథకం, మెడికల్ డివైజెస్ పార్క్ పథకం మొదలైన కార్యక్రమాల ద్వారా వైద్య పరికరాల తయారీ రంగానికి ఫార్మాస్యూటికల్స్ శాఖ సహాయ సహకారాలు అందిస్తోంది. అర్రోగ్య సంరక్షణ రంగం మార్కెట్ లో వైద్య పరికరాల తయారీ రంగం వాటా ఎక్కువగా ఉంది. ప్రస్తుతం వినియోగ వస్తువుల నుంచి ఇంప్లాంట్ చేయగల వైద్య పరికరాలు దేశంలో ఉత్పత్తి అవుతున్నాయి.పిఎల్ఐ పథకం సహకారంతో సిటీ స్కాన్, ఎంఆర్ఐ, లినక్ వంటి అత్యాధునిక వైద్య పరికరాలు దేశంలో తయారు చేస్తున్నారు.ఎక్స్‌పోలో దాదాపు 150 కి పైగా స్టార్టప్‌లు, 275 కి మించి భారతీయ, అంతర్జాతీయ వైద్య పరికరాల సంస్థలు, ఎంఎస్ఎంఈ యూనిట్లు, దాదాపు 50 పరిశోధనా సంస్థలు పాల్గొంటాయి. 200 మంది విదేశీ కొనుగోలుదారులు ఉత్పత్తిదారులతో వ్యక్తిగత చర్చలు జరుపుతారు.

# వెంకటేశ్వర స్వామి కళ్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు.. ఎమ్మెల్యే దాసరి



తిరుపతి, ఏప్రిల్ 24:తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే ఈనెల 30న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం కోసం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కళ్యాణ మహోత్సవం నిర్వహించే జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. శ్రీవారి కల్యాణం కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని, తిరుమల తిరుపతి దేవస్థానం ఉత్సవమూర్తులకు టీటీడీ అర్చకులు కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు.నియోజకవర్గ ప్రజలకు శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం చూపించాలనే ఉద్దేశంతో పెద్దపల్లిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నావన్నారు. ఈనెల 30 ఆదివారం రోజున సాయంత్రం 5 గంటలకు జూనియర్ కళాశాల మైదానంలో స్వామివారి కల్యాణం జరుగుతుందని, నియోజకవర్గ ప్రజలు కుటుంబ సమేతంగా కళ్యాణ మహోత్సవానికి హాజరై స్వామి వారి కృప కు పాత్రులు కాగలరని కోరారు. ఎమ్మెల్యే వెంట పెద్దపల్లి ఏసీపీ మహేష్, సిఐలు ప్రదీప్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, అనిల్ కుమార్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి..!!

**- ప్రజావాణిలో 29 అర్జీలు నమోదు.**
**- జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి**

సంగారెడ్డి,ఏప్రిల్ 24 (నేటి నిజం ప్రతినిధి) ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి



పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా నలు మూలల నుండి వివిధ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజల నుండి ఆయన వినతులను స్వీకరించారు.

భూ సమస్యల పరిష్కారం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరీ, ఆసరా పెన్షన్లు, ఉపాధి కల్పనకు, దివ్యాంగుల ఉపకరణాలు, తదితరాలపై (29) దరఖాస్తులు వచ్చాయని, అందులో

రెవెన్యూ శాఖకు సంబంధించి (13) ఆర్జీలు అందగా, గ్రామీణ అభివృద్ధి సంస్థ , ఐ సి డి ఎస్,హౌసింగ్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, తదితర శాఖలకు సంబంధించి (16) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారి అంబదాస్ తదితరులు పాల్గొన్నారు.

# అజాత చరిత్రకారులపై అధ్యయనం జరగాలి

**- చరిత్రకారులు అంజయ్య, డా. భిన్నూరి మహేశ్వరి**

హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కర్మభూమిలో పుట్టినందుకు మన చరిత్ర ను మనమే




అధ్యయనం చేసుకొని మాతృభూమి ఋణం తీర్చుకోవాలి అని చరిత్ర శాఖాధిపతి,చరిత్రకారుడు అంజయ్య పిలుపు నిచ్చారు.మన సంస్కృతి సంప్రదాయాలను రెడ్డి రాజులు కాపాడిన తీరు గమనార్హమన్నారు. చరిత్రకారుడు అంజయ్య అన్నారు. దక్షిణా పథ స్టడీస్ ఆధ్వర్యంలో అజ్ఞాత చారిత్రక వీరులపై ఉపన్యాసాల శీర్షి క్షలో రెండవ ఉపన్యాసంగా "రెడ్డి రా జులు " అనే అంశం పై చరిత్ర శాఖా ధిపతి , అంజయ్య ఉద్వేగ భరిత ప్రస ంగం చేశారు. రెడ్డి రాజులు దాదాపు వంద సంవత్సరాలకు పైగా పరిపా లించారనీ వారి యుద్దాలు విజయాలు వంటి చర్వితచరణ చరిత్ర కాకుండా, ఆ కాలపు సాహిత్యం గమనిస్తే మనకు అనేక కొత్త విషయాలు తెలుస్తాయి అనీ, మనం చరిత్రను చూసే దృక్కోణం లో మార్పు వస్తుందనీ, రావాలనీ అన్నారు. మన సంస్కృ తి సంప్రదాయాలను రెడ్డి రాజులు కాపాడిన తీరు గమనార్హం అనీ వ్యా పార ఎగుమతుల కోసం రెడ్డి రాజులు ఓడరేవుల ను ఎలా అభివృద్ధి చేశారో ఇంకొంత అధ్యయనం జరిగితే బాగుంటుందీ అని అభిప్రాయపడ్డారు. అనం తరం సుంభారతి సమావేశ మందిరం లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డా. భిన్నూరి మహే శ్వరి మాట్లాడుతూ, తెలంగాణ చరిత్ర, ఆంధ్ర చరిత్ర, భారతీయ చరిత్ర మొత్తంగా గమనిస్తే అనేక మంది అజ్ఞాత వీరులు మనకు కనిపి స్తారని ఈ విషయం పై ఉపన్యాసాలు మంచి ప్రారంభమనీ పేర్కొన్నారు.. అజాత చరిత్ర కారుల పై అధ్యయనం జరగా లి అని కోరుకున్నారు. ఈ కార్యక్రమ ంలో దక్షిణా పథ స్టడీస్ అధ్యక్షులు డా. గోపాల్ రెడ్డి గారు, పరిశోధన విభాగం కో-ఆర్డినేటర్ కళ్యాణచక్రవర్తి, ఉస్మా నియా విశ్వ విద్యాలయం పరిశోధక విధ్యార్ధిని విధ్యార్థులు, చరిత్ర అధ్యయన కారులు అనేకమంది పాల్గొన్నారు. డా. లక్ష్మి నారాయణ గారి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు ఆది శ్రీనివాస్ చేయూత



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి): ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేయూత అందించి, మానవత్వం చాటుకున్నారు. వేములవాడ రూరల్ మండలం మల్లారంధోభీ ఘాట్ మూలమలుపు వద్ద సోమవారం అదుపుతప్పి కారు బోల్తా కొట్టగా, అందులో ఉన్న గర్భిణీ, పలువురికి గాయాలయ్యాయి. అదే సమయంలో అటు వైపుగా కారులో వెళ్తున్న కాంగ్రెస్ నాయకుడు ఆదిశ్రీనివాస్ వెంటనే క్షతగాత్రులని పరామర్శించారు. అనంతరం తన స్వంత కారులో వారిని ఆసుపత్రికి తరలించారు. కాగా ఆది శ్రీనివాస్ పై పలువురు ప్రశంసల వర్షం కురిపించారు.

## రాయలసీమను తెలంగాణలో కలపాలని.. జేసీ దివాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

కర్నూలు ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జేసీ దివాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాయలసీమ ను తెలంగాణ లో కలపాలని.. అపుడే సాగునీటి సమస్య తీరుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఇక్కడ మిడియాతో మాట్లాడుతూ రాయలసీమను కలుపుకోవడానికి ఎవరికి అభ్యంతరం లేదని, తన వంతుగా ప్రజలను కూడగడతానని అన్నారు. రాష్ట్రాలు విడగొట్టడం, కొత్తగా ఏర్పాటు చేయడం కష్టం, కానీ కలపడం సులభమని అన్నారు.తమ వాళ్ళు ప్రత్యేక రాయలసీమ అంటున్నారని.. వస్తే మంచిదేనని జేసీ దివాకర్ రెడ్డి అన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు ఆపాల్సిన అవసరం లేదని.. ఆపలేమని అన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్రం కూడా నిధులు విడుదల చేసిందన్నారు. రాయలసీమను తెలంగాణలో కలుపుకోవలసిన అవసరం కేసీఆర్ కు ఉందన్నారు. రాయల తెలంగాణ కావడానికి ఎవరికి అభ్యంతరం లేదన్నారు. నాయకులు.. అందరితో మాట్లాడుతున్నానని.. సమీకరిస్తున్నానని.. ఎన్నికల తరువాత వేదికపై ఉన్న నేతలందరిని కలుస్తానని జేసీ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

# 2023 ఎన్నికల కోసం 2018 నుండే నగరంలో క్షేత్ర స్థాయిలో 35 డివిజన్లలో కసరత్తు చేసాం

**-మాజీ ఎంపీ వినోద్ కుమార్ కృషితోనే నేడు కరీంనగర్ స్మార్ట్ సిటీ గా శరవేగంగా రూపాంతరం చెందింది**
**-ఎమ్మెల్యే నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు ముస్లింలు అధికంగా ఉన్న డివిజన్లలోనే ఎక్కువ చేపట్టాలి**
**-ముస్లిం డివిజన్లలో చెప్పుకోదగ్గ పనులు చేయకపోగా..కొద్ది పనులు చేసి అభివృద్ధి చేశామనడం సరికాదు**
**-పెండింగ్ సమస్యలపై తమ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ ను కలువబోతున్నాం**
**-ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సంచలన వ్యాఖ్యలు**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి): అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ బిజెపి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యే, ఎంపీ ఆశావహులు మేము 100 కోట్లు ఖర్చు పెట్టైన గెలిచి తీరుతామని అవాకులు, చెవాకులు పేల్చుతున్నారని, ఎంఐఎం పార్టీ కూడా తక్కువేమీ కాదని, తమ అధిష్టానం ఆదేశించి ఏఅభ్యర్థినైనా పోటీలో ఉండాలని ప్రకటిస్తే, విశ్వ వ్యాప్తంగా ఉన్న ఎంఐఎం పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషుల నుంచి అవసరమైతే తాము 1000 కోట్ల విరాళాలు సేకరించి సత్తా చాటుతామని, కరీంనగర్ గడ్డపై ఎంఐఎం జెండాను నిక్కచ్చిగా ఎగురవేస్తామని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం రాత్రి ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలాంలో నిర్వహించిన ఈద్ మిలావ్ కార్యక్రమంలో గులాం అహ్మద్ హుస్సేన్ పలు కీలక అంశాలపై మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమరం కోసం 2018లో నుండే కసరత్తు చేస్తున్నామని, ఎంఐఎం పార్టీ నేతల చిత్తశుద్ధి, పనితనం తోనే నేడు 35 డివిజన్లలో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అయిందన్నారు. తెలంగాణలో గడచిన 9సంవత్సరాలలో హిందూ, ముస్లింల మధ్య మత ఘర్షణలు, వివాదాలు సమసి పోవడానికి ఎంఐఎం పార్టీ కృషియే కారణమన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కృషి వల్లనే నేడు కరీంనగర్ స్మార్ట్ సిటీగా శరవేగంగా రూపాంతరం చెందిందన్నారు. కరీంనగర్కు స్మార్ట్ సిటీ తీసుకొచ్చి, కోట్లాది రూపాయల నిధులను సమకూర్చిన ఘనత వినోద్ కుమార్ కే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే నిధులతో ముస్లిం డివిజన్లలో




అత్యధికంగా అభివృద్ధి కార్యక్రమాలు ఖచ్చితంగా చేవట్టాల్సిందేనని, ఎందుకంటే ఎంఐఎం పార్టీ మద్దతుతో, ముస్లింల కష్టార్జితంతో బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు గెలిచి నేడు ఎంఐఎం పార్టీ పట్ల, ముస్లిం డివిజన్ల పట్ల చూసి చూడనట్లు, ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, దమ్ముంటే ఎంఐఎం మద్దతు లేకుండా రాబోయే ఎన్నికల్లో గెలిచి తీరాలని సవాల్ విసిరారు. బిఆర్ఎస్ అభ్యర్థుల చేతిలో ఓడిపోయినటువంటి బిజెపి అభ్యర్థి మీడియా ఎదుట ఎన్నికల ఫలితాల రోజు ఈగెలుపు ఎంఐఎం పార్టీదని, బీఆర్ఎస్ అభ్యర్థిది కాదని చెప్పలేదా అని ప్రశ్నించారు. ముస్లిం డివిజన్లలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయకపోగా, తూతూ మంత్రంగా కొద్ది పనులు మాత్రమే చేసి అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల, 2019 పార్లమెంట్ ఎన్నికల రిపోర్ట్ను తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కరీంనగర్ లో పెండింగులో ఉన్న సాలెహ్ నగర్, చింతకుంట ఈద్గాల సమస్యలు, ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ముస్లిం షాదీఖానలో క్రాకరి, బైపాస్ రోడ్ లో మోడల్ ఖబ్రస్థాన్ అభివృద్ధి, కశ్మీర్ గడ్డ, ముకరంపుర, గోదాంగడ్డలోని ముస్లింల కోసం నూతన ఖబ్రస్థాన్ కోసం భూమి, జిల్లా వ్యాప్తంగా ఉర్దూ రెండవ బాషా అమలు, నగర వ్యాప్తంగా కాలనీల సూచిక బోర్డు లపై పేర్లు ఉర్దూలో వ్రాయించాలని,

తమ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలో త్వరలో సీఎం కేసీఆర్ ను కలవబోతున్నట్లు పేర్కొన్నారు. కొందరు మైనారిటీ అసమర్థ నాయకుల పిచ్చి ప్రేలాపనలు, ఆలోచనలతోనే బిఆర్ఎస్, ఎంఐఎంల మధ్య దూరం పెరిగిందన్నారు. తమకు బిఆర్ఎస్ పార్టీ అధిష్టానంతో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. గత రెండు దశాబ్దాల క్రితం కొందరు ఎంఐఎం పార్టీ రాజకీయ ప్రత్యర్థులు, ఎంఐఎం పార్టీ పాతబస్తీకే పరిమితమని, నయాపూల్ అవతలి పార్టీ అని, రిక్షావాలా పార్టీ అని ఎద్దేవా చేశారని, కానీ నేడు ఎంఐఎం పార్టీ దేశవ్యాప్తంగా 14రాష్ట్రాలలో విస్తరించి, సర్వజనుల సమస్తహితం కోసం పోరాడే పార్టీగా అవతరించిందన్నారు. ఎంఐఎం పార్టీని విమర్శించిన వాళ్లు ఇప్పుడు వారి తలలను ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఈద్ మిలావ్ సందర్భంగా షీర్ ఖుర్మా పాయసాన్ని పార్టీ నాయకులకు అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమరుద్దీన్, కోశాధికారి ఇబ్రహీం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఫిరోజ్ అఖీల్, కార్పొరేటర్ శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, ఎండి, సాజిద్, సాజిద్ మాజిద్, ఇస్మాయిల్, ఫసియుద్దీన్ ఖాలీద్, షాకిర్ నహ్వి, ఆమెర్ ఖురేషి, బాస్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న ఎస్సై రాజేష్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి): మహిళకు అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఐ రాజేష్ రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నాడు. మొన్నటి రోజున నైట్ పెట్రోలింగ్ డ్యూటీలో భాగంగా సుమారు ఒంటి గంట సమయంలో ముస్తాబద్ బస్టాండ్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేస్తుండగా, ముస్తాబద్ మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ భార్య అనారోగ్యంతో ముస్తాబద్ లోని పీపుల్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా, అర్ధరాత్రి బి పాజిటివ్ బ్లడ్ అత్యవసరం కాగా ఆ రాత్రి ఎం చేయాలో అర్థం కాకా అక్కడే డ్యూటీ చేస్తున్న ఎస్ఐ రాజేష్ ని బాధితుడు వేడుకున్నాడు. స్పందించిన ఎస్సై రాజేష్ వెంటనే డ్యూటీ నుండి వెళ్లి రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న మహిళకి అత్యవసర సమయంలో అర్ధరాత్రి స్పందించి రక్తం దానం చేసిన ఎస్ఐ రాజేష్ కి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత అధికారులు ఎస్ఐ ని అభినందించారు. ఎస్ఐ వెంట ముస్తాబద్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

# రైతులు అధైర్యపడవద్దు..ప్రభుత్వం నుండి సాయం అందేలా కృషి చేస్తా-డాక్టర్ గోలి మోహన్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజక వర్గం కోనరావుపేట మండలంలోని నిజామాబాద్, కొండాపూర్, నిమ్మపెల్లి, వట్టిమల్ల, మరిమడ్ల, కోనరావుపేట గ్రామాల్లో రెండు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో 70 శాతం పంట నష్టం జరిగిన గ్రామాల్లో డాక్టర్ గోలి మోహన్ సోమవారం పర్యటించి, రైతుల పొలాల్లో పండించిన పంట నేల పాలవ్వడం చూసి, ఆవేదన చెందారు. అనంతరం

నష్ట పోయిన రైతులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వడగండ్ల వాన తీరని శోకాన్ని మిగిల్చిందని ఆవేదన చెందారు. ఆరుకాలం కష్టపడి, చెమటోడ్చి వేసిన పంట చేతికొచ్చే సమయానికి నేలపాలు అయిందని డాక్టర్ గోలి మోహన్ తో చెబుతూ కన్నీటి పర్యంతం అయ్యారు. అనంతరండాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యానికి ఎవరు బాధ్యులు కారని, కానీ ప్రభుత్వం నష్టపోయిన రైతులకు అండగా ఉండాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు ప్రభుత్వముగా ముందుకు సాగుతున్నారని, అలాంటి మంచి మనసున్న కేసీఆర్, జిల్లా మంత్రి కేటీఆర్ వెంటనే అధికారులను ఆదేశించి, పంట నష్టం జరిగిన రైతులకు నష్టపరిహారాన్ని తొందరగా వచ్చే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్వో, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ సరైన రిపోర్టును వెంటనే తయారుచేసి ప్రభుత్వానికి నివేదించాలని, ఆపదలో ఉన్న రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ఎవరు కూడా అధైర్య పడవద్దని, ప్రభుత్వం నుంచి ఏదైనా ఆలస్యం జరిగితే తన దృష్టికి తీసుకొస్తే, మంత్రి కేటీఆర్ తో మాట్లాడి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

# తెలంగాణాలోని కరీంనగర్ వద్ద తమ నూతన ఇంటిగ్రేటెడ్ సదుపాయం ప్రారంభించిన టాటా హిటాచీ డీలర్‌షిప్ రామా ఎక్స్‌కవేటర్



హైదరాబాద్, ఏప్రిల్ 24:ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణా రాష్ట్రాలలో టాటా హిటాచీ యొక్క డీలర్‌షిప్, రామా ఎక్స్‌కవేటర్ సేల్స్, సర్వీస్, స్పేర్ పార్ట్స్ మరియు మెషీన్ కేర్ ఫెసిలిటీ (ఎంసీఎఫ్) కోసం తమ నూతన ఇంటిగ్రేటెడ్ సదుపాయాన్ని కరీంనగర్‌లో ప్రారంభించింది.

టాటా హిటాచీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ బీకెఆర్ ప్రసాద్ ఈ ఒన్ స్టాప్ సేల్స్, సర్వీస్, విడిభాగాల షాప్‌ను ప్రారంభించారు. టాటా హిటాచీ యొక్క కార్యకలాపాలను రాష్ట్రంలో మరింతగా విస్తరిచేందుకు ఇది సహాయపడనుంది.

"టాటా హిటాచీ స్థిరంగా వినియోగదారులకు మెరుగైన సేవలను సమయానికి అందించేలా వారికి దగ్గరగా ఉండేందుకు కార్యకలాపాలను విస్తరిస్తుంది. ఈ ఇంటిగ్రేటెడ్ సదుపాయం, మా వినియోగదారులకు అత్యున్నత శ్రేణి సేవలు, విడిభాగాలను అందించాలనే మా ప్రయత్నానికి కొనసాగింపు" అని బీకెఆర్ ప్రసాద్ అన్నారు.

టాటా హిటాచీ అధీకృత డీలర్‌గా రామా ఎక్స్‌కవేటర్ 1999 నుంచి కార్యకలాపాలను కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, వరంగల్‌లో నిర్వహిస్తుంది. కరీంనగంలో కేవలం 8 మెషీన్‌లతో ప్రారంభించి ఇప్పుడు దాదాపు 600 మెషీన్లు తిరుగుతున్నాయి. తద్వారా ఈ ప్రాంతంలో టాటా హిటాచీ మార్కెట్ లీడర్‌గా వెలుగొందుతుంది.

"కరీంనగర్‌లో కేవలం 200 చదరపు అడుగుల విస్తీర్ణంలో మేము కార్యకలాపాలు ప్రారంభించగా, నేడు ఈ సదుపాయాన్ని 20వేల చదరపు అడుగుల విస్తీర్ణానికి పెంచాము" అని రామా ఎక్స్‌కవేటర్ మేనేజింగ్ డైరెక్టర్ భజరంగ్ బజాజ్ అన్నారు. "ఈ కేంద్రంలో ఎంసీఎఫ్, ఆఫీస్ ప్రాంగణం, స్టోరేజీ, మెషీన్ యార్డ్, గ్రీన్ స్పేస్, వంటివి టాటా హిటాచీ నిబంధనలకు అనుగుణంగా ఉంటాయి" అని అన్నారు

ఈ నూతనంగా ప్రారంభించిన కేంద్రంలో మెషీన్ల ఓవర్‌హాల్, వెల్డింగ్, ఇంజిన్ మరమ్మత్తులు, హైడ్రాలిక్ మరమ్మత్తులు కూడా చేస్తారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా విడిభాగాలు, మరమ్మత్తుల సర్వీస్‌పై 15% రాయితీ అందిస్తారు. "ఈ సదుపాయం వినియోగదారుల నడుమ ఆదరణ పొందడంతో పాటుగా వారు ఖర్చు చేసిన నగదుకు మరింత విలువను అందిస్తుందని ఆశిస్తున్నాము" అని రామా ఎక్స్‌కవేటర్ భాగస్వామి, సంజయ్ బజాజ్ అన్నారు.

# ఏప్రిల్ 30న ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నిర్వహించనున్న 100వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజలు పెద్ద సంఖ్యలో వినేలా చూసేందుకు చర్యలు తీసుకోవాలి.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:తన లోక్‌సభ నియోజకవర్గం పనిచేస్తున్న పిఆర్ఐ ప్రతినిధులతో కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ శాస్త్రం, సిబ్బంది వ్యవహారాలు, పెన్షన్, అణుశాస్త్రం, అంతరిక్ష వ్యవహారాల శాఖ సహాయ ( స్వతంత్ర బాధ్యత) ఈ రోజు ఆన్‌లైన్ లో మాట్లాడి వివిధ అంశాలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

పంచాయతీ రాజ్ సంస్థలకు చెందిన డీడీసీ, బీడీసీ, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్‌లతో సహా పలువురు మంత్రితో మాట్లాడారు. నియోజకవర్గంలో మారుమూల, సుదూర ప్రాంతాలకు చెందిన పిఆర్ఐ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కథువా జిల్లా, ఇతర పహాడీ ప్రాంతాల్లో ఉన్న బని, బసోహ్లి, బిల్లావర్ ప్రాంతాలకు చెందిన .పిఆర్ఐ ప్రతినిధులు మంత్రితో ఆన్‌లైన్ లో మాట్లాడారు. కథువాతో ఇతర జిల్లాలకు చెందిన సర్పంచ్‌లు, పంచ్ ప్రతినిధులు కూడా మంత్రితో మాట్లాడారు.

దాదాపు మూడు గంటల సేపు కార్యక్రమం జరిగింది. పిఆర్ఐ ప్రతినిధులు, పార్టీ సభ్యులను రెండు బృందాలుగా విభజించి కార్యక్రమాన్ని నిర్వహించారు. విడివిడిగా జరిగిన సమావేశాల్లో మంత్రి సమావేశానికి హాజరైన వారందరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. పార్లమెంట్ సభ్యునిగా మంత్రి వారానికి ఒకసారి నియోజక వర్గంలో ఒక జిల్లాలో పర్యటించడం ప్రారంభించారు. పర్యటన సమయంలో న్యాయంగా కలవలేక పోయిన ప్రాంతాలకు చెందిన వారితో మంత్రి ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్నారు.

నియోజకవర్గానికి సంబంధించిన కొన్ని తాజా సమాచారం, ఇటీవల ఆమోదించిన కొత్త అభివృద్ధి పనుల వివరాలను కేంద్ర మంత్రి వివరించారు. ఏప్రిల్ 30న ప్రసారం కానున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా వినాలని పిఆర్ఐ ప్రతినిధులకు మంత్రి సూచించారు. పేద సంఖ్యలో ఒకచోట ప్రజలు కూర్చోవడానికి ఏర్పాట్లు చేసి అందరూ కలిసి కార్యక్రమం వినేలా చూడాలని ఆయన అన్నారు.

# ఇంటి నిర్మాణానికి పది లక్షలు ఇవ్వాలి: గోకినేపల్లి వెంకటేశ్వరరావు



ఖమ్మం, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి): కెసిఆర్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు,ఇంటినిర్మాణాని కి రూ. 10లక్షలు ఇవ్వకుంటే ప్రజాగ్రహానికి గద్దె కూలడం ఖాయంసిపిఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు హెచ్చరిక సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కొరకు రూ. 10లక్షలు మంజూరు చేయాలని, స్థలం లేని వారికి ఇళ్లస్థలం ఇచ్చి,ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు ఇవ్వాలని,ఇప్పటికే పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నిష్పక్షపాతంగా వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ,లేనట్లయితే కెసిఆర్ ప్రభుత్వం ప్రజాగ్రహానికికూలడం ఖాయమని సిపిఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వంరావు హెచ్చరించారు. పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలోమండుటెండలో, దద్దరిల్లే నినాదాలతో,ఒక చేతితోఎర్రజండాలు, మరో చేతితో దరఖాస్తు ఫారాలు పట్టుకుని, సోమవారం కలెకక్టర్ కార్యాలయం వద్ద వేలాది మందితో భారీ ప్రజాప్రదర్శన,ధర్నా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ధర్నానుద్దేశించి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ,గ్రామీణ ప్రాంతాల నుండి పనుల దొరకక నిరుపేదలు వలసలు వచ్చి,అనేక సంవత్సరాల నుండి ఖమ్మం నగరంలో జీవన్నా కొనసాగిస్తున్నారని,నిరుపేదలైన వారికి వచ్చే ఆదాయంతో ఇంటి అద్దెలు చెల్లించలేక,మురికి కాలువల వక్కన జీవిస్తూ, అనారోగ్యానికి గురై,బతుకే కష్టంగా వారి బ్రతుకు మారిందన్నారు.వారు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట,ఉండడానికి ఇల్లు తదితర కనీస సౌకర్యాల కోసం చాలా ఇబ్బంది పడుతున్నారని,రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఉన్న ఈ నిరుపేదలు కలో,గంజో త్రాగి,పొట్ట నింపుకున్నా ఉండటానికి సొంత ఇల్లు లేని పరిస్థితియని, సొంతంగా స్థలం కొని నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేదని, గ్రామీణ ప్రాంతాలలో సైతం ఇవాళ గజం వడిలేపు రూపాయల నుండి 20వేల రూపాయలు వరకు ధర ఉన్న నేపథ్యంలో, పేదరైతులు,కూలీలు,సొంతంగా స్థలం కొని ఇల్లు కట్టుకునే ఆర్థిక స్తోమత లేదన్నారు.వీరందరికి ఇళ్ల స్థలం ఏర్పాటు చేసి ఇల్లు కట్టించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని,కనుక స్థలం లేని వారికి ఇంటి స్థలం ఏర్పాటు చేసి,ఇంటి నిర్మాణానికి10 లక్షలు మంజూరు చేయాలని,సొంత జాగా ఉన్న వాళ్లకి ఇల్లు నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరి చేయాలని,పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నిష్పక్షపాతంగా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్

డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తానని అన్నాడనీ,గత ప్రభుత్వాలు చిన్నచిన్న టిక్కీలు లాంటి ఇండ్లు కట్టించారని,ఇంటికి బంధువులు వస్తే బయట పడుకోవాల్సి వస్తుందని,అందువలన పేదలకు డబల్ బెడ్రూమ్ ఇల్లు కట్టిస్తానని పేదలు, ధనికులతో సమానంగా హాయిగా ఉండొచ్చని అనేక సందర్భాల్లో చెప్పారనీ,అరచేతిలో వైకుంఠం చూపించారన్నారు.ఎంతో ఆశతో లక్షలాదిమంది ఎదురుచూస్తే,వందల సంఖ్యలో ఇల్లు నిర్మించారని వారి ఆశలు అడియాశలయ్యాయనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఆ నిర్మించిన ఇండ్లు కూడా నాసిరకంగానూ, ఆశ్రితపక్షపాతంతోను, అధికారుల నిర్లక్ష్యంతో నిరుపేదలకు అందని ద్రాక్షలాగా అందకుండా పోయాయనీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం పూర్తిగా విఫలమైందనీ,టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అయినప్పటికీ, అరకొరగానే ఇల్లులు ఇచ్చారని, నేడు ఇంకా చాలామందికి అవసరమైన వారికి ఒక్క సెంటు స్థలం కూడా పంచలేదనీ, గతంలో ఇందిరమ్మ పథకం పేరుతో నిర్మించుకున్న ఇండ్ల బకాయి బిల్లులను కూడా చెల్లించలేదనీ, గృహ నిర్మాణశాఖని రద్దు చేయడం పెద్ద అవినీతిని, దీంతో లబ్ధిదారులు లక్షలాది రూపాయలు నష్టపోయారన్నారు.కెసిఆర్ మాటలతో ప్రజలను ఊరిస్తున్నారు తప్ప ఆచరణలో అమలు చేయడం లేదు.కనుక పట్టణాల్లో నివాసం ఉంటున్న కార్మికులు, నిరుపేదలు,గ్రామీణ ప్రాంతాల్లో పేద రైతులు, వ్యవసాయ కూలీలు,నిరుపేదలు సొంతంగా ఇంటి స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకొనే ఆర్థిక స్తోమత లేదనీ,కనుక వారికి ఉండటానికి నీడ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నది. అందువలన కేంద్రప్రభుత్వం 5లక్షలు,రాష్ట్ర ప్రభుత్వం5లక్షలు కలిపి మొత్తం10 లక్షలు మంజూరు చేయాలని,అలాగే ఇప్పటివరకు నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నిష్పక్షపాతంగా పేదలకు పంపిణీ చేయాలని, అందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య,సివై పుల్లయ్య, ఆర్ శివలింగం,మలీదు నాగేశ్వరరావు,బందెల వెంకయ్య,కమ్మకోమటి నాగేశ్వరరావు,పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి,జిల్లా కార్యదర్శి టీ.ఝాన్సీలక్ష్మి,రాష్ట్ర నాయకులు ఆవుల మంగతాయి,పార్టీ జిల్లా నాయకులు ఎస్కె లాల్ మియా,గంటా శ్రీనివాసరావు,కొయ్యల శ్రీనివాస్,బి.లాజర్,ఎన్ అజాద్, అమర్లపూడి శరత్, కుర్రా వెంకన్న, కొండే వెంకటేశ్వర్లు,పగిడికత్తుల రామదాసు,కంకణాల శ్రీనివాస్,మందా సురేష్, మారుతీ మల్లయ్య,రెంటాల యాదగిరి, తడకమళ్ల సీతారాములు, చిర్రా భిక్షం,పాశం అప్పారావు,మేక రామనాథం,వీర్ల వేంకటప్పారావు, కూరాకుల నరసయ్య, లక్ష్మీనారాయణ,కేలోత్ లక్ష్మణ్,డి.చంద్, వి.వెంకటేష్,ఒగ్గు నాగిరెడ్డి, ప్రసాద్, సత్తారు, పూలమ్మ, చాను,దారావత్ లక్ష్మణ్,యశోద, సుజాత,భవాని తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం రాశులతో తెలంగాణ కళకళ

## - పాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి

## -ధాన్యం కొనుగోలు కేంద్రం ను ప్రారంభించిన పా క్స్ చైర్మన్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి): రైతు బంధువుడు రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం రైతుల పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని పాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారంవేములవాడ రూరల్ మండలం వెంకటం పల్లి గ్రామంలో పాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను పా క్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పా క్స్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులకు ఇబ్బంది లేకుండా యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రతిపాదకన ఏర్పాటు చేశారన్నారు. మధ్య దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాన్యం అమ్ముకొని మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్రయ్య, ఎంపీపీ బండ మల్లేశం, పాక్స్ వైస్ ఛైర్మెన్ లక్ష్మీకాంతా రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, సెస్ డైరక్టర్ ఆకుల దేవరాజం, చెక్కపెల్లి సర్పంచ్ జైపాల్ రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, పాక్స్ సీఈవో లక్ష్మణ్ ,డైరెక్టర్లు సురేందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, బొడ్డు రాములు, రైతులు తదితరులు ఉన్నారు..

# కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోండి



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు శిబిరమును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు, జెడ్పిటిసి మ్యాకల రవి అన్నారు. వేములవాడ అర్బన్ మండలం చిర్లవంచ గ్రామంలో సోమవారం స్థానిక సర్పంచ్ రంగు సత్తమ్మ రాములు ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ జెడ్పిటిసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల కోసం వారి ఆరోగ్య రక్షణలో భాగంగా ఈ ఉచిత శిబిరం ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించుకోని, ఉచితముగా కళ్ళజోడులు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆర్ సి రావు, ఎంపిటిసి వనపర్తి దేవరాజు, కంటి వెలుగు ఇన్చార్జ్ వైద్యుడు రామకృష్ణ, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మధ్య ప్రదేశ్ లోని రీవా లోజరిగిన పంచాయతీరాజ్ జాతీయ దినం వేడుకల ను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:పంచాయతీ రాజ్ జాతీయ దినం సందర్భం లో మధ్య ప్రదేశ్ లోని రీవా లో ఈ రోజు న జరిగిన ఒక కార్యక్రమం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. దాదాపు గా 17,000 కోట్ల రూపాయల విలువ కలిగినటువంటి ప్రాజెక్టుల కు ఆయన శంకుస్థాపన చేయడం తో పాటుగా వాటిని దేశ ప్రజల కు అంకితం ఇచ్చారు కూడాను.

విద్యవాసిని మాత కు మరియు ధైర్య సాహసాల గడ్డ కు ప్రధాన మంత్రి ప్రణామాన్ని ఆచరించి జనసమూహాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. తన ఇంతకు ముందటి సందర్శనల ను మరియు స్థానిక ప్రజల ఆప్యాయత ను ఆయన స్మరించుకొన్నారు. దేశవ్యాప్తం గా 30 లక్షల కు పైగా పంచాయతీ ప్రతినిధులు వర్చువల్ మాధ్యం ద్వారా ఈ కార్యక్రమం లో పాలుపంచుకోవడాన్ని ప్రధాన మంత్రి గమనించి, అది భారతదేశ ప్రజాస్వామ్యం యొక్క ధైర్యయుక్త చిత్రాన్ని ఆవిష్కరించిందన్నారు. ఇక్కడ కు విచ్చేసిన ప్రతి ఒక్క వ్యక్తి తాలూకు పని పరిధి వేరు వేరు గా ఉండవచ్చు గాని ప్రతి ఒక్కరు దేశాని కి సేవలు అందిస్తుంచడం ద్వారా పౌరుల కు సేవ చేయాలనే ఉమ్మడి లక్ష్యం కోసమే పాటుపడుతున్నారని ఆయన అన్నారు. పల్లెల కు మరియు పేదల కు ప్రభుత్వం అమలుజరప తలపెట్టిన పథకాల ను పంచాయతీ లు పూర్తి సమర్పణ భావం తో సాకారం చేస్తుండడం పట్ల ప్రధాన మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు. పంచాయతీ స్థాయి లో సార్వజనిక సేకరణ నిమిత్తం ఇ-గ్రామ్ స్వరాజ్, ఇంకా జిఇఎమ్ పోర్టల్ ఏర్పాటు ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, అది పంచాయతీ ల పనితీరు ను సులభతరం చేస్తుందన్నారు. 35 లక్షల స్వామిత్వ సంపత్తి కార్డుల పంపిణీ ని గురించి మరియు మధ్య ప్రదేశ్ అభివృద్ధి కి గాను 17,000 వేల కోట్ల రూపాయల విలువైన రేల్ వే స్, గృహ నిర్మాణం, నీరు మరియు ఉద్యోగ కల్పన సంబంధి పథకాల ను గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

స్వాతంత్ర్యం తాలూకు అమృత కాలం లో, అభివృద్ధి చెందినటువంటి ఒక భారతదేశాన్ని ఆవిష్కరించాలి అనే స్వప్నాన్ని సాకారం చేసే దిశ లో ప్రతి ఒక్క పౌరుడు/పౌరురాలు అత్యంత సమర్పణ భావం తో శ్రమిస్తున్నారని ప్రధాన మంత్రి అన్నారు. అభివృద్ధి చెందినటువంటి ఒక దేశాన్ని నిర్మించడం కోసం భారతదేశం లోని గ్రామాల లో సామాజిక వ్యవస్థ ను, ఆర్థిక వ్యవస్థ ను మరియు పంచాయతీ రాజ్ వ్యవస్థ ను అభివృద్ధి పరచడాని కి ప్రాముఖ్యాన్ని ఇవ్వవలసి ఉంటుందని ఆయన నొక్కిచెప్తూ, పంచాయతీ ల పై భేదభావాన్ని ప్రదర్శించిన మునుపటి ప్రభుత్వాల కు భిన్నం గా ఒక బలమైన వ్యవస్థ ను ఏర్పాటు చేయడం తో పాటుగా దాని పరిధి ని విస్తరింప జేయడాని కి కూడానున వర్తమాన ప్రభుత్వం అలుపెరుగక కృషి చేస్తోందన్నారు. 2014 వ సంవత్సరాని కంటే క్రితం ఇదివరకటి ప్రభుత్వాల కృషి లో లోపాన్ని గురించి ప్రధాన మంత్రి వివరిస్తూ, ఆర్థిక సంఘం 70,000 కోట్ల కంటే తక్కువ మొత్తాన్ని మంజూరు చేసింది, దేశం యొక్క సువిశాలత్వాన్ని లెక్క లోకి తీసుకొన్నప్పుడు అది చాలా చిన్న మొత్తం, అయితే 2014 వ సంవత్సరం తరువాత ఈ గ్రాంటు ను 2 లక్షల కోట్ల కు పైచిలుకు కు పెంచడం జరిగిందని తెలియ జేశారు. 2014 వ సంవత్సరం కంటే క్రిందటి దశాబ్ద కాలం లో కేవలం 6,000 పంచాయతీ భవనాల ను నిర్మించడం జరగగా, వర్తమాన ప్రభుత్వం గడచిన 8 సంవత్సరాల లో 30,000కు పైగా పంచాయతీ భవనాల ను నిర్మించిందని ఆయన తెలియ జేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత 2 లక్షల కు పైగా గ్రామ పంచాయతీ లకు ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ లభించిందని, అంతకు పూర్వం ఈ ఆప్టికల్ ఫైబర్ సదుపాయం జతపడ్డ గ్రామ పంచాయతీలు 70 కి లోపే ఉండేవని కూడా ఆయన వెల్లడించారు. భారతదేశాని కి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ఇదివరకటి ప్రభుత్వాలు, ప్రస్తుత పంచాయతీ రాజ్ వ్యవస్థ పట్ల విశ్వాస లోపాన్ని కలిగివుండేవని కూడా ఆయన అన్నారు. 'భారతదేశం పల్లెల లోనే మనుగడ సాగిస్తుంద'ని చెప్పిన గాంధీ మహాత్ముని పలుకుల ను ప్రధాన మంత్రి గుర్తు కు తీసుకు వస్తూ, ఇదివరకటి హయాం ఆయన ఆదర్శాల పట్ల కనబరచిన శ్రద్ధ ఎంత మాత్రం లెక్క లోకి రాదని, తత్ఫలితం గా పంచాయతీ రాజ్ కొన్ని దశాబ్దుల తరబడి నిర్లక్ష్యాని కి లోనైందన్నారు. ప్రస్తుతం పంచాయతీ లు భారతదేశం యొక్క అభివృద్ధి కి ప్రాణవాయువు గా ఉన్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. "పంచాయతీ లు సమర్థం గా కృషి చేయడాని కి గ్రామ పంచాయత్ వికాస్ యోజన తోడ్పడుతోంది'ని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. గ్రామాల కు మరియు నగరాల కు మధ్య అంతరాన్ని భర్తీ చేయడాని కి ప్రభుత్వం నిర్విరామం గా కృషి చేస్తోందని ప్రధాన మంత్రి అన్నారు. డిజిటల్ రెవలూశన్ తో ముడిపడ్డ ప్రస్తుత కాలం లో పంచాయతీల ను స్మార్ట్ గా తీర్చిదిద్దడం జరుగుతోంది. పంచాయతీ లు చేపట్టే ప్రాజెక్టుల లో సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం జరుగుతోందని ఆయన వివరించారు. అమృత్ సరోవర్ అభియాన్ లో భాగం గా స్థలాల ఎంపిక తో పాటు ప్రాజెక్టు ను పూర్తి చేయడం వంటి అంశాలు అన్నీ కూడా సాంకేతిక విజ్ఞానం యొక్క అండదండల ను తీసుకొని ముందుకు పోతున్న విషయాన్ని ఒక ఉదాహరణ గా ప్రధాన మంత్రి పేర్కొన్నారు. పంచాయతీ స్థాయి లో సార్వజనిక సేకరణ నిమిత్తం జిఇఎమ్ (ఉవఓ) పోర్టల్ ను ఉపయోగించుకోవడం అనేది పంచాయతీల కు సేకరణ ను సులభం గా మరియు పారదర్శకమైంది గా మార్చివేయనుందని ఆయన అన్నారు. స్థానిక కుటీర పరిశ్రమ లు వాటి అమ్మకాల కు గాను ఒక బలమైన బాట ను కనుగొన గలుగుతాయని ప్రధాన మంత్రి అన్నారు.

పిఎమ్ స్వామిత్వ పథకం లో సాంకేతిక విజ్ఞానం యొక్క ప్రయోజనాన్ని గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. ఈ పథకం పల్లెల లో సంపత్తి హక్కుల రూపురేఖల ను మార్చివేస్తోంది. వివాదాల ను మరియు వ్యాజ్యాల ను తగ్గిస్తోందని ఆయన తెలియ జేశారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.